quicktodaynews.com

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

## విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.

తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే తెలుగు దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 237 | ఆదివారం, మే 19 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## బలమైన ప్రభుత్వంతోనే
# శతృదేశాలకు వణుకు
### అప్పుడే మనవైపు కన్నెత్తి చూడాలంటే ఆలోచిస్తారు



- అయోధ్య, కాశ్మీర్ సమస్యలను పరిష్కరించాం
- అధికారం కోసం కాంగ్రెస్ ఆచరణసాధ్యం కాని హామీలు
- అవి అమలు చేస్తే దేశం దివాళా తీయడం ఖాయం
- పదేళ్లలో మా లక్ష్యం ఎంత బలంగా ఉందో చాటాం
- అంబాలా, ముంబై ప్రచారంలో ప్రధాని మోడీ

**అంబాలా/ముంబై,(క్విక్ టుడే) :** కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండాల్సిన అవసరాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీనొక్కిచెప్పారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉంటే శత్రువు మనపై ఏది చేయాలన్నా ఒకటికి వంద సార్లు ఆలోచిస్తాడని అన్నారు. ఎన్నికల ఘట్టం చివరిదశకు చేరుకుంటున్న వేళ ప్రధాని మోడీ ప్రచారంలో దూసుకుపోతున్నారు. హర్యానాలోని అంబాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ శనివారంనాడు ప్రసంగించారు. ఆరో విడత ఎన్నికల్లో భాగంగా హర్యానాలోని 10 లోక్‌సభ స్థానాలకు మే 25న పోలింగ్ జరుగనుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ..దేశంలో బలమైన ప్రభుత్వం ఉంటే, శత్రువులు మనపై ఏది చేయడానికైనా ముందు వందసార్లు ఆలోచిస్తారు. పాకిస్థాన్ 70 ఏళ్ల నుంచి భారతదేశానికి ఇక్కట్లపాలు చేస్తోంది. వాళ్లకు చేతిలో బాంబులు ఉన్నాయి. ఇవాళ వాళ్ల చేతుల్లో భిక్షాపాత్ర ఉంది. బలమైన ప్రభుత్వం అనేది ఉంటే శత్రువులు వణుకుతారని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌ను ప్రస్తావిస్తూ, అక్కడి పరిస్థితిని బలహీన ప్రభుత్వం ఉంటే మార్చగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయాన్ని ఓసారి గుర్తుచేసుకుంటే హర్యానాలోని వీరమాతలు రేయింబవళు ఆందోళనతో ఉండేవారనీ, ఈరోజు పదేళ్లుగా అవన్నీ ఆగిపోయాయని చెప్పారు. బలమైన మోదీ ప్రభుత్వం 370వ అధికరణ అనే గోడను కూల్చేసిందని, కశ్మీర్ అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. జూన్ 4వ తేదీన ఫలితాలు వెలువడడానికి మరో 17 రోజులే ఉన్నాయని, నాలుగు విడతల పోలింగ్‌లో ఇండియా కూటమి ఎత్తులను ప్రజలు చిత్తుచేశారని అన్నారు. దేశభక్తి నరనరాల్లో ఉన్న రాష్ట్రం హర్యానా అని, దేశవ్యతిరేక శక్తులు ఏవో ఇక్కడి ప్రజలకు బాగా తెలుసునని అన్నారు. ప్రజల కలలు పండించడమే తన రిజల్యూషన్ అని, అదే తన గ్యారెంటీ అని మోదీ హామీ ఇచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా రేయింబవళ్లు పనిచేస్తానని, వికసిత్ భారత్‌కు పేదలు, యువకులు, మహిళలు, రైతులు నాలుగు మూల స్తంభాలని చెప్పారు. నా దేశం, నా హిందుస్థాన్ బలపడాలనే ఆలోచనతో

మిగతా 2లో...

### ఇసి అనుమతి కోసం రాత్రి 7గంటల వరకు
# ఎదురుచూపులు

- సచివాలయంలోనే సిఎం,మంత్రులు, సిఎస్,అధికారులు
- సోమవారం వరకు అనుమతి కోసం ఎదురు చూడాలని నిర్ణయం
- లేకపోతే మంత్రులతో కలసి ఢిల్లీలో ఇసిని కలుస్తామన్న సిఎం రేవంత్
- రైతులు, రుణమాఫీ తదితర అంశాలపై చర్చించాలనుకున్నట్లు వెల్లడి
- కాళేశ్వరంపై ఎన్‌డిఎస్‌సి నివేదికపై సిఎం మంత్రులతో చర్చ



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** ఈసీ నుంచి స్పందన లేకపోవటంతో రైతుల సంక్షేమం, అత్యవసరమైన అంశాలపై చర్చించలేకపోయామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసీ నుంచి అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే కేబినేట్ భేటీ జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు.




సోమవారం లోపు ఈసీ నుంచి అనుమతి రాకపోతే, అవసరమైతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి అనుమతి కోరుతామని చెప్పారు. ఇసి అనుమతి లేని కారణంగా తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం వాయిదా పడింది. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి

మిగతా 2లో...

## టీఎస్‌ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

- అగ్రికల్చర్, ఫార్మసీలో 88.25శాతం బాలురు
- 90.18శాతం బాలికల ఉత్తీర్ణత
- ఇంజినీరింగ్‌లో 74 38శాతం బాలురు,
- 75.85శాతం బాలికల ఉత్తీర్ణత

వివరాలు 2లో

### ఎంతమందిని అరెస్ట్ చేస్తారో
# చేసుకోండి
### మీ కార్యాలయానికే నేరుగా వస్తాం
### ఎక్స్ వేదికగా బిజెపికి కేజ్రీవాల్ సవాల్



**న్యూఢిల్లీ,(క్విక్ టుడే) :** ఆమ్‌ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ పై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ దాడికి పాల్పడిన ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో బిభవ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై కేజ్రీవాల్ స్పందించారు. పార్టీ నేతలతో భాజపా ప్రధాన కార్యాలయానికి చేరుకుంటానని.. వీలైతే అందరినీ అరెస్టు చేసుకోవాలంటూ సవాల్ చేశారు. ప్రధాని మోదీ జీ.. మీరు ఆప్ నేతలైన మనీశ్ సిసోదియా, సంజయ్‌సింగ్, నాతో సహా ఒక్కొక్కరినీ కారాగారానికి పంపిస్తూ గేమ్ ఆడుతున్నారు. ఇంకా ఎవరిని జైల్లో పెట్టాలనుకుంటున్నారు? రేపు మధ్యాహ్నం 12 గంటలకు నా పార్టీ నేతలు, కార్యకర్తలతో భాజపా ప్రధాన కార్యాలయానికి చేరుకుంటా. వారందరినీ ఒకేసారి అరెస్టు చేసుకోండి అంటూ కేజ్రీవాల్ 'ఎక్స్' వేదికగా వీడియో పోస్టు చేశారు. ఇంతకీ ఆప్ ఏం తప్పు చేసింది? పేదలకు నాణ్యమైన విద్య, మొహల్లా క్లినిక్‌లను అందించడమే అది చేసిన తప్పా? మంచి పనులకు అడ్డుకట్ట వేసేందుకే భాజపా తీవ్రంగా యత్నిస్తోంది. మా నేతలందరినీ జైల్లో పెట్టి ఆప్‌ను నాశనం చేయాలని

మిగతా 2లో...

# ఓటర్లను రెచ్చగొడుతున్న మోడీ
### బుల్‌డోజర్లు మావద్ద అయితే లేవు

-రెగ్గొట్టేవారిపై ఇసి చర్యలు తీసుకోవాలి -ఇండియా కూటమి చట్టబద్ధంగా పాలిస్తుంది
-ముంబైలో ఉమ్మడి మీడియా సమావేశంలో ఖర్గే




**ముంబై,(క్విక్ టుడే) :** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓటర్లను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. విపక్ష 'ఇండియా'కి ఓటు వేసి గెలిపిస్తే రామాలయంపై బుల్డోజర్ నడిపిస్తుందంటూ పదేపదే ప్రధాని చేస్తున్న వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీపీ-ఎస్‌పీ నేత శరద్ పవార్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేతో కలిసి ముంబైలో శనివారంనాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఖర్గే పాల్గొన్నారు. ఇప్పటి వరకూ మాదగ్గర బుల్డోజర్లు లేవు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి. ప్రధానమంత్రే స్వయంగా ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజలను రెచ్చగొడుతున్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ ప్రకారం అన్నింటినీ పరిరక్షిస్తాం. మేము రాజ్యాంగాన్ని అనుసరిస్తాం అని ఖర్గే స్పష్టం చేశారు. మహారాష్ట్రలో నిజమైన పార్టీకి బదులు బీజేపీకి మద్దతిస్తున్న వర్గాలకు ఎన్నికల కమిషన్ గుర్తులను కేటాయించడాన్ని ఆయన తప్పుపట్టారు. నయవంచన, కుట్రలతో మహారాష్ట్రలో చట్టవిరుద్ధంగా 'మహాయుతి' ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రధానమంత్రే స్వయంగా దీనికి మద్దతిచ్చారని, మహారాష్ట్రలో ర్యాలీలు కూడా తీశారని అన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో చీలికలు తెచ్చే ప్రయత్నం చేస్తుంటారని ఆరోపించారు. నిజమైన పార్టీల

మిగతా 2లో...

### అత్యధిక లోక్‌సభ
# సీట్లు గెలుస్తున్నాం
### ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి



**యాదాద్రి,(క్విక్ టుడే) :** తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలను గెలుస్తున్నామని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలను గెలుస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని గుర్తుచేశారు. శనివారం భువనగిరిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో తమ పార్టీకి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పుకొచ్చారు.దేశంలో మేధావులు , విద్యావంతులు బీజేపీకి అండగా ఉన్నారని తెలిపారు. తెలంగాణలో ఏ ఎన్నికలు వచ్చినా ఫలితాలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే శక్తి రేవంత్ రెడ్డికి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు పార్టీలో ఉండే పరిస్థితి లేదని చెప్పారు.తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నా యనీగా తమ పార్టీ ఎదుగుతుందన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలను కాపాడుకోలేని కేసీఆర్ ఏ విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

మిగతా 2లో...

### సిఎం రేవంత్‌తో ముగ్గురు
# బిజెపి ఎమ్మెల్యేల భేటీ
### రైతు సమస్యలు, ధాన్యం కొనుగోళ్లపై వినతిపత్రం అందచేత



**హైదరాబాద్,(క్విక్ టుడే) :** తెలంగాణ రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్న బీజేపీ నేతలు హఠాత్తుగా సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యారు. ఈసీ పర్మిషన్ వస్తే మంత్రి వర్గ సమావేశం నిర్వహించాలనుకున్న రేవంత్ రెడ్డి సచివాలయంలోనే ఉన్నారు. అయితే హఠాత్తుగా ఆయనను కలిసేందుకు బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పైడి రాకేష్ రెడ్డిలు వచ్చారు. వారితో రేవంత్ రెడ్డి అరగంటపాటు సమావేశం అయ్యారు. రైతు సమస్యలు అదేవిధంగా ధాన్యం కొనుగోలుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని బీజేపీ నేతలు ప్రకటించారు. ఈ మేరకు వారు సమర్పించిన వినతి పత్రాన్ని మీడియాకు రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రితో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు భేటీ కావడంతో బీజేపీలోనూ చర్చనీయాంశం అయింది. మామూలుగా అయితే వినతి పత్రం ఇవ్వడానికి ముఖ్యమంత్రిని కలిసేందుకు బీజేపీ శాసనసభాపక్షం మొత్తం

మిగతా 2లో...

(మొదటి పేజీ తరువాయి)

## బలమైన ప్రభుత్వంతోనే

ఈ నాలుగు స్తంభాలను పటిష్టం చేస్తానని అన్నారు. ఇకపోతే తరవాత మహారాష్ట్రలో పర్యటించారు. కాంగ్రెస్ చెబుతున్న మేనిఫెస్టోలోని హామీలు అమలు చేస్తే భారత్ దివాళా తీయడం ఖాయమని ప్రధాని మోదీ విమర్శించారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం ముంబయిలో పర్యటించారు. ప్రతిపక్ష ఇండియా కూటమి ముంబయికి నమ్మకద్రోహం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోని మావోయిస్టుతో పోల్చిన ఆయన.. దాన్ని అమలు చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ పతానావస్థకు చేరుతుందని చివరకు భారత్ దివాళా తీస్తుందని విమర్శించారు. మనుగడే కష్టంగా మారిన కాంగ్రెస్ ఇష్టానుసారంగా హామీలు ఇస్తోంది. దేవాలయాల్లో బంగారం, మహిళల మెడలో మంగళసూత్రాలపై ఆ పార్టీ కన్ను పడింది. 50 శాతం వారసత్వ పన్ను విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ప్రజల ఆస్తిని ఎక్స్ రే తీసి, ఓట్ జిహాద్ గురించి మాట్లాడే వారి ఓటు బ్యాంకుకు అప్పగిస్తోంది. పది సంవత్సరాల పాలనాకాలానికి సంబంధించిన రిపోర్ట్ కార్డు, 25 సంవత్సరాల దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం నా వద్ద ఉన్న ప్రణాళికలు ఒక వైపు, పదుల సంఖ్యలో ప్రధాని అభ్యర్థులు ఉన్న ఇండియా కూటమి మరో వైపు నిలబడ్డాం. ప్రజలు ఎటు వైపు ఉండాలో ఇప్పటికే తేల్చేశారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దైనా అతి కష్టంతో కూడుకున్న పనులు. వాటిని మా హయాంలో పూర్తి చేయగలిగాం. ఇవన్నీ మీ విలువైన ఓటుని సరైన నాయకత్వానికి అప్పగించడం వల్లే అయ్యాయి. మరోసారి బీజేపీ సర్కార్‌ని ఆశీర్వదించండని ప్రధాని మోదీ ఓటర్లను కోరారు.

## ఎంతమందిని అరెస్ట్ చేస్తారో

చూస్తోంది. అది ఎన్నటికీ జరగదు. ఆప్ ప్రజల గుండెల్లో ఉందని కేజ్రీవాల్ దుయ్యబట్టారు. దిల్లీ సీఎం కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై భాజపా స్పందించింది. సొంత పార్టీ మహిళా నేతపై జరిగిన దాడిపై కేజ్రీవాల్ మౌనం వహిస్తున్నారు. మీరు చేస్తున్న డ్రామాలు ఇక ఆపండి. ఆమెపై దాడి జరిగి రోజులు గడుస్తున్నా ఇంకా ఎందుకు పెదవివిప్పడం లేదు. ఈ ఘటనకు బాధ్యులు ఎవరని భాజపా చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా ప్రశ్నించారు.

## సిఎం రేవంత్‌తో ముగ్గురు

కలిసి వెళ్తుంది. ప్రత్యేకంగా ముగ్గురు వెళ్లే అవకాశం ఉండదు. అయితే ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు ఏ ఉద్దేశంతో వెళ్లారన్నదానిపైనా బీజేపీలో చర్చ జరుగుతోంది. బీజేపీ శాసనసభాపక్షం నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎన్నికల ముందు వరకూ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి ఆయన కాంగ్రెస్ తరపునే పోటీ చేయాల్సి ఉంది. కానీ ఎన్నికలకు ఆరు నెలల ముందట బీజేపీలో చేరి ఆ పార్టీ తరపున పోటీ చేసి గెలిచారు. ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. ఆయనపై కీలక ఆరోపణలు చేశారు. మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ లోకి వస్తానని తనతో చెప్పారని కానీ తాను పట్టించుకోలేదన్నారు. రామారావు పటేల్ కూడా కాంగ్రెస్ నేతనే. ఆయన ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కు రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరి గెలిచారు. పైడి రాకేష్ రెడ్డి వ్యాపారవేత్తగా పేరు గడించి బీజేపీలో చేరారు. ఆర్మూర్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. వీరు ముగ్గురికీ బీజేపీతో అంతంత మాత్రంగానే అనుబంధం ఉండటం.. ప్రత్యేకంగా సీఎం రేవంత్ ను కలవడంతో గుసగుసలు ప్రారంభమ య్యాయి.అయితే ఎమ్మెల్యేలు ఏ పార్టీ వారన్నది సమస్య కాదని.. ఎవరు అడిగినా అపాయింట్ మెంట్ ఇస్తానని రేవంత్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. రేవంత్ రెడ్డిని కలిశారు. వారిలో చాలా మందిపై పార్టీ మార్పు ప్రచారం జరిగింది.

## ఓటర్లను రెచ్చగొడుతున్న మోడీ

నుంచి గుర్తులు లాక్కుని బీజేపీకి మద్దతిచ్చే పార్టీలకు వాటిని కేటాయించడం వంటి నిర్ణయాలన్నీ మోదీ ఆదేశాల మీదే జరుగుతున్నాయన్నారు. మహారాష్ట్రలో 'ఇండియా' కూటమి పనితీరుపై ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 48 సీట్లలో 46 సీట్లు తమ కూటమి గెలుచుకుంటుందని, ప్రజలే స్వయంగా ఈ విషయం చెబుతున్నారని అన్నారు. తమ కూటమి బీజేపీని ఓడించి గరిష్టంగా సీట్లు గెలుచుకోవడం ఖాయమని చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ మధ్య ఎన్నికల డైనమిక్స్‌పై అడిగిన ఒక ప్రశ్నకు ఖర్గే సమాధాన మిస్తూ, ఢిల్లీలో రెండు పార్టీలు బీజేపికి వ్యతిరేకంగా కలిసి పనిచేస్తున్నాయని, పంజాబ్‌లో వేర్వేరుగా పోటీలో ఉన్నాయని చెప్పారు. ఇది ప్రజాస్వామ్యం. బీజేపీని ఓడించడానికి ఏమి చేయాలో అది చేస్తాం అని ఖర్గే తెలిపారు.

## ఇసి అనుమతి కోసం రాత్రి 7గంటల వరకు

రాకపోవడంతో కేబినెట్ భేటీని రద్దు చేశారు. శనివారం సాయంత్రం మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకోవాలని భావించింది. ఇందుకు సంబంధించిన అజెండాను కూడా సీఎస్ సిద్ధం చేశారు. కానీ, ఈసీ నుంచి అనుమతి రాకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు సచివాలయం నుంచి తిరిగి వెళ్లి పోయారు. ఈసీ అనుమతి వచ్చినప్పుడే కేబినెట్ భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. ఎల్లుండి లోపు ఈసీ అనుమతి రాకపోతే మంత్రులతో కలిసి దిల్లీ వెళ్లి ఈసీ అనుమతి కోరాలని సీఎం నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు, నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న ఉండటంతో కేబినెట్ సమావేశానికి ఈసీ అనుమతించలేదని సమాచారం. శనివారం మధ్యాహ్నం కేబినేట్ సమావేశం నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కానీ ఒక వైపు లోక్‌సభ ఎన్నికల కోడ్, మరో వైపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో కేబినెట్ సమావేశానికి అనుమతించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈసీని కోరింది. కానీ శనివారం రాత్రి వరకు ఈసీ నుంచి అనుమతి రాలేదు. ఈసీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కేబినెట్ భేటీ నిలిచిపోయింది. ఈసీ నుంచి ఏ క్షణమైన అనుమతి వస్తుందని మంత్రులు అందరూ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సచివాలయంలోనే వేచి ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని విభాగాల అధికారులు కేబినేట్ భేటీకి హాజరయ్యేందుకు ఆఫీసులకు చేరుకున్నారు. కానీ రాత్రి 7 గంటల వరకు ఈసీ నుంచి స్పందన లేకపోవటంతో కేబినేట్ భేటీ జరగలేదు. దీంతో చేసేదిలేక సీఎంతో పాటు మంత్రులు వెనుదిరిగి వెళ్లారు.రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన విషయాలపై ఈ భేటీలో చర్చించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎజెండా సిద్ధం చేసుకుంది. కానీ తెలంగాణ కేబినేట్ సమావేశం వాయిదా పడింది. ఈసీ స్పందించకపోవడంతో మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసినట్లు సర్కార్ తెలిపింది. ఇదిలావుంటే పర్మిషన్ పై క్లారిటీ రాకపోవటంతో.. సెక్రటేరియట్ లో ఇరిగేషన్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, కొండా సురేఖ సహా.. ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## టీఎస్ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్,మే18:** టీఎస్ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎప్‌సెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులు తమ ఫలితాలకు సంబంధించిన ర్యాంకు కార్డులను టీఎస్ఎప్‌సెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగిన ఈఏపీసెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) పరీక్షలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 3.35 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీలో 88.25శాతం బాలురు, 90.18శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్‌లో 74 38శాతం బాలురు, 75.85శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. రెండు విభాగాల్లోనూ బాలురే టాప్‌లో ఉన్నారు. తెలంగాణలో ఇదే మొదటి ఈఏపీసెట్. కాగా, ఈ పరీక్షకు అగ్రికల్చర్ , ఫార్మ విబాగాలకు 91,633 మంది విద్యార్థులు హాజరవగా.. వీరి శాతం 91.24 శాతం ఉంది. ఇంజనీరింగ్ విభాగంలో 2,40,618 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా మొత్తం ఈఎపీసెట్ కి 3,32,251 మంది విద్యార్థులు హాజరయ్యారు.టీఎస్ఎప్‌సెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో తొలి 9 ర్యాంకులను అబ్బాయిలు కైవసం చేసుకున్నారు. ఇందులో మొదటి రెండు ర్యాంకులు ఏపీ విద్యార్థులు సాధించారు. టాప్ 10 ర్యాంక్‌లో ఒక్క అమ్మాయి మాత్రమే నిలిచింది. ఇంజనీరింగ్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సతివాడ జ్యోతిరాదిత్య – శ్రీకాకుళం, రెండవ ర్యాంక్ గొల్ల లేఖ హర్ష – కర్నూల్, మూడవ ర్యాంక్ రిషి శేఖర్ శుక్ల సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్ టెన్‌లో ఒక్క అమ్మాయి మాత్రమే నిలిచింది. ధనుకొండ శ్రీనిధి – విజయనగరం,10వ ర్యాంక్ సాధించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల వెల్లడి సందర్భంగా విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. గతేడాది వరకు ఎంసెట్ పేరు మీద పరీక్షలు నిర్వహించామని, ఈసారి ఎంసెట్ పేరును మార్చి ఎప్‌సెట్‌ను మొదటి సారిగా నిర్వహించామని తెలిపారు.

ఈ సందర్భంగా ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. ఈఎపీసెట్ రాసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఈసారి పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. గతంలో ఒక్కో షిఫ్ట్ లో 25 వేల మంది మాత్రమే పరీక్ష రాసేవారు. ఈసారి ఒక్కో షిఫ్ట్‌లో 50వేల మంది పరీక్ష రాసినట్లు ఆయన వెల్లడించారు. ఫలితాలు చూసి విద్యార్థులు ఆందోళన చెందవద్దని సూచించారు. త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూలును విడుదల చేస్తానమని లింబాద్రి తెలిపారు.




















# గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షను సజావుగా నిర్వహించాలి

**- పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి**
**- అన్ని జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు ఆదేశాలు**




**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే న్యూస్ :** జూన్ 9న నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ లను, సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి ఇతర సభ్యులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 9న నిర్వహించు గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 563 గ్రూప్- 1 పోస్టులకు ఫిబ్రవరి లో నోటిఫికేషన్ విడుదల చేసిందని, జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీ నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో గతంలో రెండు సార్లు పొరపాట్లు జరిగాయని, వాటిని పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రూప్ -1 పరీక్షలు సజావుగా నిర్వహించే దిశగా కలెక్టర్ లను చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారులుగా, అదనపు కలెక్టర్ లను అదనపు కోఆర్డినేటింగ్ అధికారులుగా నియమిస్తున్నామని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని చూసుకోవాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9.00 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, అభ్యర్థులు రెండు గంటల ముందుగా వచ్చే విధంగా చూసుకోవాలని, ఎట్టి పరిస్థతుల్లో 10.00 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరగాలని, ప్రతి అంశం సీసీ కెమెరాలు రికార్డు అయ్యే విధంగా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. జిల్లాలలోని పరీక్ష కేంద్రాలకు ఇంచార్జీ లను నియమించాలని, జిల్లా అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిద్ధం చేయాలని, పరీక్ష నిర్వహణకు అవసరమైన మేర సిబ్బందిని నియమించాలని కలెక్టర్ లకు సూచించారు. అభ్యర్థుల అవసరాల మేరకు అదనపు బస్సులు ఆ రోడ్డులలో నడిపే విధంగా ఆర్టిసి అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పోలీస్ బందోబస్తు ఉండాలని, ప్రశ్న పత్రాల, ఓ.ఎం.ఆర్ షీట్ లో భద్రతకు స్ట్రాంగ్ రూం లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకునేందుకు వీలుగా అవసరమైన మేర రిజిస్ట్రేషన్ కౌంటర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కౌంటింగ్ విధులను జాగ్రత్తగా నిర్వహించాలి

**నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరి చందన**





**నల్లగొండ జిల్లా ప్రతినిధి.మే 18. (క్విక్ టుడే ) :** పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పై శనివారం నల్గొండ కలెక్టరేట్ లోని ఉదయాదిత్య భవన్లో కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి, నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి చందన హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ లో అధికారులు, సిఐబంది బాగా పనిచేశారని, ఇదే ఉత్సాహంతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ టేబుల్ వద్ద పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అలర్ట్ గా ఉండాలన్నారు . కౌంటింగ్ ప్రక్రియలో ఏ చిన్న సమస్య తలెత్తిన వెంటనే ఆర్వో, ఏఆర్ఓల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న ఎన్నికల నియమావళి కింద చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే మైక్రో అబ్జర్వర్స్, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ సెంటర్ లోకి ప్రవేశించిన సమయం నుండి ఏఏ స్టేజీలలో ఎటువంటి పనులు చేయాలి ఎటువంటి పనులు చేయకూడదు అనే విషయాలకు సంబంధించి ట్రైనర్ బాలు వారికి విపులంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ పులిచింతల నటరాజన్, డిఆర్డిఓ నాగిరెడ్డి,నల్గొండ దేవరకొండ, హుజూర్నగర్ సూర్యాపేట, చండూరు ఆర్డీవోలు, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్ లు హాజరయ్యారు.

# ఇంటర్ అడ్వాన్స్ డ్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే న్యూస్ :** మే 24 నుండి జూన్ 3 వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. శనివారం రోజున అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల పై నిర్వహించిన సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లో 50443 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారనీ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పరిధిలో 89 సెంటర్ లు ఉన్నాయని అందులో మొదటి సంవత్సరం కు 36940 ద్వితీయ సంవత్సరమునకు 13503 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మొదటి సంవత్సరం ఉంటుందని, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులకు కోరారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని డి యం అండ్ హెచ్ ఓ కి ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ప్రతిరోజు తాగునీటినీ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని టిఎస్ఆర్టిసినీ కోరారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపర్డెంట్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కిషన్, ఎ సి పి చంద్రకుమార్, సత్యనారాయణ,విద్యుత్ శాఖ అధికారిసతీష్,పోస్టల్అధికారిసంపత్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలి

**పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కళ్ళెం ఉపేందర్**



**నల్లగొండ జిల్లా ప్రతినిధి.మే 18. (క్విక్ టుడే ) :** నల్లగొండ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలనితీన్మార్ మల్లన్న టీం రామన్నపేట మండల కన్వీనర్ , యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సభ్యులు కళ్ళెం ఉపేందర్ పట్ట బద్రులను, ప్రభుత్వ, ప్రవేట్ కార్యాలయలలో పనిచేసే ఉద్యోగులను కలిసి విజ్ఞప్తి చేశారు శనివారం నల్గొండ పట్టణంలో జరిగిన ప్రచారంలో బాగంగా ఆయన మాట్లాడుతూ కష్ట కాలంలో సామాన్య ప్రజలను విద్యార్థులను అన్ని విధాలా ఆదుకున్న ప్రజా సేవకుడు తీన్మార్ మాల్లన్న అని కొనియాడారు తనకున్న యావదాస్తిని సైతం ప్రభుత్వంకు ఇచ్చిన ఏకైక నాయకుడు మల్లన్న మాత్రమేనన్నారు నిరుద్యోగులకు ప్రభుత్వ పరంగా ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నేరుగా మాట్లాడి చొరవ తీసుకుంటాడని పేర్కొన్నారు సమస్యలన్నీ పరిష్కార%శీ% కావాలంటే పట్ట బద్రులైన విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాద్యాయులు, అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రయివేటు స%శీ%స్థల్లో పనిచేసే పట్ట బద్రులందరూ కలిసి తీన్మార్ మల్లన్నకు ఒకటో ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు తదితరులు ఉన్నారు.

# టైలరింగ్ కార్మికులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**



**నల్లగొండ జిల్లా ప్రతినిధి మే 18. (క్విక్ టుడే ) :** నల్గొండ పట్టణంలో టైలరింగ్ కార్మికులకు కూలిరేట్లు పెంచాలని, ప్రభుత్వం 120 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించిన కార్మిక నాయకుడు శ్రీ రామదాసు వెంకటేశ్వర్లు అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టైలరింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య అన్నారు. శనివారం నల్గొండ పట్టణంలోని హనుమాన్ నగర్ లో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ పట్టణ అధ్యక్షులు శ్రీరామదాసు వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈసందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 25 సంవత్సరాల పాటు నల్గొండ పట్టణంలో టైలరింగ్ కార్మికుల కూలి రేట్ల పెంపు కోసం ఇతర సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించినారని కొనియాడారు. రెడ్ మేడ్ దుస్తువులు మార్కెట్లోకి వచ్చిన తర్వాత టైలరింగ్ కార్మికులకు పనులు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీరామదాసు వెంకటేశ్వర్లు పోరాట స్ఫూర్తితో ప్రభుత్వ హాస్టల్, హాస్పిటల్స్ లకి అవసరమైన దుస్తుల తయారీ మధ్య దళారీలకు ఇవ్వకుండా నేరుగా టైలరింగ్ కార్మికులకు ఇవ్వాలని, ప్రభుత్వం 120 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, లక్ష రూపాయలు ఎలాంటి గ్యారెంటీ లేకుండా బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని, టైలర్ షాపులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం టైలరింగ్ కార్మికులు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ , పోలే సత్యనారాయణ, టైలరింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు రాపర్తి లక్ష్మీనారాయణ, తాడూరు సంతోష్ కుమార్, మరియు వారి కుమారులు శ్రీరామదాసు వేణు, శ్రీరామదాసు గోపి యూనియన్ సభ్యులు శంకర్, మనోహర్, సాగర్, యాదగిరి, రాము, చారి, తదితరులు పాల్గొన్నారు.

# బిబి సాహెబ్ మక్తలో తుంగతుర్తి రవి పర్యటన



**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బిబి సాహెబ్ మక్త 8వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పర్యటించారు. శ్రీశ్రీ నగర్ కాలనీలో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అస్తగస్తంగా ఉండటంతో అధ్యక్షుల వారి దృష్టికి తీసుకురావడంతో వారు తక్షణమే స్పందించి కమిషనర్, ఏఈ దృష్టికి తీసుకెళ్లి సమస్యను తక్షణమే పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, మేడిపల్లి మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు, 8వ డివిజన్ ఇంచార్జ్ ఎర్ర ఐలేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సారిక మహేష్ గారు వార్డ్ ఆఫీసర్ సంపత్ గారు కనకయ్య కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం

**ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అనివార్యం**
**సామాజిక న్యాయ సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం**





**నల్లగొండ జిల్లా ప్రతినిధి. మే 18. (క్విక్ టుడే) :** నల్గొండ జిల్లా ఎస్బిఆర్ గార్డెన్ నందు నిర్వహించిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అనివార్యం సదస్సు రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ హాజరై మాట్లాడుతూ సామాజిక న్యాయం చేసి మండల మహోదయం భవిష్యత్తులో బీసీ బిడ్డలు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ బిడ్డలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయడం లేదు కావున ప్రత్యేక రాజకీయ పార్టీ అనివార్యమని తెలియజేసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఐక్యత భావంతో సోదర భావంతో కలిసి మెలిసి ఉండి మన ఓట్లు మనం వేసుకొని రాజ్యాధికారాన్ని తీసుకొచ్చుకోవాలని తెలియజేశారు దేశంలో రాష్ట్రంలో భక్తనుల పైన అనేక దాడులు జరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు లేవు అని మాట్లాడారు ఈ కార్యక్రమ సభ అధ్యక్షులు వంటపాక యాదగిరి బీసీ సంక్షేమ సంఘం నాయకులు చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ మామిడి ప్రమీల ముఖ్య అతిథులు: పర్వతాలు , రోజా నేత, మిరియాల యాదగిరి, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి భిక్షపతి. బిఎస్పి పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ మస్యుద్దీన్ కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల జగన్ బి.ఎం.పి పార్టీ రాష్ట్ర నాయకులు నజీరుద్దీన్ సీనియర్ అడ్వకేట్ మామిడి బాలయ్య ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అడ్వకేట్ అధ్యక్షులు కట్టెల శివకుమార్ బిఎస్పి పార్టీ జిల్లా జిల్లా కార్యదర్శి చాంద్ భాష చెన్న శ్రీకాంత్ బిసి సందీప్ బిసి మామిడి పద్మ కొండూరు సత్యనారాయణ శ్రవణ్ కుమార్ బి.ఎస్.పి పార్టీ నాయకులు బొడ్డు కిరణ్ సంయుక్తారాణి సామాజిక అల్లంపల్లి కొండన్న పగడాల శివతేజ తరుణ్ కళ్యాణి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 331 ఆరాధన మహోత్సవం





**సికింద్రాబాద్ :** శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 331 ఆరాధన మహోత్సవం విశ్వకర్మ సంసికింద్రాబాద్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 331 ఆరాధన మహోత్సవం విశ్వకర్మ సంఘం సికింద్రాబాద్ లో జరిగింది సుమారు 1000 మంది భక్తులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది, నూతన లిఫ్ట్ ప్రారంభోత్సవం కూడా విశ్వకర్మ సంఘం అడ్వైజర్స్ పొలాసగిరి కృష్ణ గారు మరియు బుద్ధారం సుధాకర్ చారి గారిచే ప్రారంభించబడినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్ , ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారి, కోశాధికారి బోనాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రామమందిరం పేరుతో మోడీ రాజకీయం

**- బుల్‌డోజర్లతో కూలుస్తారంటూ మత విద్వేషాలు**

**- రామాలయానికి పునాది పడ్డదే రాజీవ్ హయాంలో - కాంగ్రెస్ అప్పడే అధికారంలోకి వచ్చివుంటే నిర్మాణం జరిగేది**

**- బిజెపి లాగా కాంగ్రెస్ రాజకీయాలకు రాముడిని వాడుకోలే - మోడీ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**



**హైదరాబాద్,మే18:** ప్రధాని మోదీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నాడని.. కాంగ్రెస్ వస్తే రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారంటూ ప్రచారం చేయడం దారుణమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మోదీ మత విశ్వాసాలను రెచ్చగొట్టుతున్నాడని.. ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. రామాలయం దేవాలయ గేట్స్ తెరిచింది దివంగత ప్రధాని రాజీవ్ గాంధీయే అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టు తీర్పును గౌరవించి హిందువుల మనోభావాలు గౌరవించే విధంగా రామ్ లల్లా గేట్స్ తెరిచింది రాజీవ్ గాంధీయేనని జీవన్ రెడ్డి వెల్లడించారు. దేవాలయ గేట్స్ తెరిచినప్పుడు మోదీ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.1989లో శిలన్యాస్ చేశారు.. అప్పుడు ప్రధాని రాజీవ్ గాంధీ. గుడి శంకుస్థాపనకి అనుమతి ఇచ్చింది రాజీవ్ గాంధీ. 1989లో రాజీవ్ గాంధీ అధికారం లోకి వస్తే అప్పుడే రామాలయం పూర్తి అయ్యేదని అన్నారు. ఫైజాబాద్ కోర్ట్ తీర్పు ను గౌరవించి 1989 లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ అని గుర్తు చేశారు. అయోధ్య రామ్ లాల్లో గేట్లు తెరిచాడన్నారు. రామ మందిరం అంకురార్పణ రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. రామ మందిర్ నిర్మాణ జాప్యానికి బీజేపీనే కారణమని కీలక వ్యాఖ్యలు చేశారు. లేదంటే 20 ఏండ్ల ముందు నిర్మాణం పూర్తి అయ్యేదన్నారు. అప్పుడు మోడీ ఎక్కడ ఉన్నాడన్నారు. వాస్తవాలను కప్పి పుచ్చడానికి మోడీ ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. మత సామరస్యానికి కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టే పార్టీ బీజేపీ అన్నారు. శ్రీ రాముణ్ణి రాజీవ్ గాంధీ ఆదర్శంగా తీసుకున్నాడని తెలిపారు. న్యాయ స్థానం తీర్పును ఎవరైనా గౌరవించాలన్నారు. బీజేపీ న్యాయ స్థానం ఆసరాగా తీసుకుని నిర్మాణం చేసిందన్నారు.బీజేపీ ఎన్నికల కోసం గుడిని వాడుకోవడం వల్లనే వివాదం జరిగిందన్నారు.. దేశంలో మత విశ్వాసాలు రెచ్చగొట్టడంతో ఈ అంశం తీవ్రం అయ్యింది. దేశంలో ధార్మిక చింతనను పెంపొందించింది రాజీవ్ గాంధీ. ఆయన ప్రధానిగా ఉన్నపుడు దూరదర్శన్‌లో రామాయణ, మహా భారతాలు ప్రసారమయ్యాయి. ఆదర్శ దేవుడిగా.. పాలనలో ప్రజాభిప్రాయాన్ని విలువని ఇచ్చింది శ్రీరాముడు. దూరదర్శన్‌లో ఎవరి ఆలోచన విధానానికి అనుగుణంగా టెలికాస్ట్ అయ్యాయి? హిందువుల మనోభావాలు గౌరవించేది గాంధీ కుటుంబం. సెక్యులరిజం అంటే అందరి భావలను గౌరవించడమే' అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. రామ మందిర్ నిర్మాణ జాప్యానికి బీజేపీనే కారణమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మోడీ ప్రధాని హోదాలో ఉండి మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మీరు దేశాన్ని ఎటు వైపు తీసుకపోవాలని అనుకుంటున్నారని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఆర్టీసీ బస్ లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మోడీ తప్పు పడుతున్నారన్నారు. మహిళల పట్ల మోడీకి ఉన్న వివక్షత అర్థమౌతుందన్నారు. మోడీ ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ద్వంద వైఖరిని అవలంబిస్తున్నాడని అన్నారు. దేశంలో బుల్ డోజర్ కల్చర్ ను తెచ్చింది బీజేపీ పార్టీ, కాంగ్రెస్ కాదన్నారు.

# భూభాగోతంతో ఆలయ పూజారి కిడ్నాప్

**- చిత్రహింసలు పెట్టి కట్టిపడేసిన దుండుగుల - తప్పించుకుని వచ్చి పోలీసులకు ఫిర్యాదు**

**చిత్తూరు,మే18:** కొందరు దుర్మార్గులు తాము చేసిన పని ఎక్కడ బయటపడుతోందననే భయంతో ఓ గుడి పూజారిని కిడ్నాప్ చేశారు. ఆపై చిత్రహింసలకు గురి చేశారు. తాము పోలీసులమంటూ వచ్చి తీసుకెళ్లిన దుండగులు.. నరకం చూపించారు. ఎలాగోలా వారి చెర నుంచి పూజారి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించగా.. అసలు విషయం బయటపడింది. ఇంతకీ పూజారిని ఎవరు కిడ్నాప్ చేశారు? ఎందుకు కిడ్నాప్ చేశారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని గంగాదర నెల్లూరు మండలం అంకాల పరమేశ్వరి గుడి పూజారి రామచంద్రన్‌ను దుండగులు కిడ్నాప్ చేశారు. 15 రోజుల ముందు కిడ్నాప్ జరగగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు చెప్పిన వివరాల ప్రకారం.. నిందితులు కొందరు తమిళనాడు పోలీసులమంటూ వచ్చారు. అలా తీసుకెళ్లిన దుండగులు.. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురి చేశారు. వారి నుంచి తప్పించుకుని బటయపడిన రామచంద్రన్.. పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు 12 మంది నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కిడ్నాప్ ఘటనలో ప్రధాన నిందితుడు కొత్తపల్లి మిట్ట వద్ద గల స్మార్ట్ డివి చైర్మన్, అగరమంగళం అంకాల పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ చైర్మన్ తాళ్ల దీపక్ కుమార్‌గా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితుడైన దీపక్ కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో అగరమంగళం గ్రామస్తుడు రామచంద్రన్.. గతంలో అంకాల పరమేశ్వర ఆలయ పూజారిగా ఉన్నారు. అగర మంగళం అంకాల పరమేశ్వరి ఆలయ భూములను దీపక్ కుమార్ మాయమాటతో లాగేసుకుని ట్రస్ట్ ఏర్పాటు చేశాడు. అయితే, ప్రస్తుతం రామచంద్రన్ ఎదురు తిరుగుతాడేమోనన్న భయంతో అతన్ని కిడ్నాప్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు నిందితులు. దీపక్ కుమార్ తమిళ పోలీసుల పేరు చెప్పి తనను తీసుకెళ్లారని, చిత్రహింసలకు గరి చేసి.. మత్తు మంచి ఇచ్చి చంపే ప్రయత్నం చేశారని బాధితుడు రామచంద్రన్ ఆరోపించాడు. అయితే, రామచంద్రన్ కిడ్నాపర్ల చెర నుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించడంతో అసలు కథ అడ్డం తిరిగింది. వారిపై కేసు నమోదైంది.

# పల్నాడు జిల్లా కలెక్టర్‌గా లట్కర్ శ్రీకేశ బాలాజీ

**- మూడు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం**

**- తిరుపతికి హర్షవర్ధన్, పల్నాడుకు మల్లికాగార్గ్ - అనంతపురం ఎస్పీగా గౌతమిశాలి**

**అమరావతి,మే18:** పల్నాడు జిల్లా కలెక్టర్‌గా లట్కర్ శ్రీకేశ్ బాలాజీతో పాటు మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు ఎస్పీగా మల్లికా గార్గ్, తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్, అనంతపురం ఎస్పీగా గౌతమి సాలిని నియమించింది. ఏపీలో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన హింసపై కేంద్ర ఎన్నికల సంఘంతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీతో భేటీ తర్వాత అసహనం వ్యక్తం చేస్తూ మూడు జిల్లాలకు చెందిన కీలక ఉన్నతాధికారులపై కొరడా ఝుళిపించింది.

పల్నాడు, అనంతపురం జిల్లా ఎస్పీలపై సస్పెన్షన్ వేటు వేసిన ఈసీ.. ఇద్దరినీ వెంటనే విధుల్లోంచి తప్పించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్, డీజీపీలను ఆదేశించింది. అలాగే, పల్నాడు జిల్లా కలెక్టర్, తిరుపతి ఎస్పీలను బదిలీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఏపీలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన అల్లర్లు తీవ్ర కలకలం రేపాయి. పోలింగ్ జరిగిన మరుసటి రోజు కూడా చాలా చోట్ల టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ చోటు చేసుకుంది. ఈ అల్లర్లను సీరియస్ గా తీసుకున్న ఈసీ ఆయా జిల్లాల ఎస్పీలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సస్పెండ్ చేసిన ఎస్పీల స్థానంలో కొత్త ఎస్పీలను నియమిస్తూ ఎన్నికల సంఘం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్, పల్నాడు జిల్లా ఎస్పీగా మల్లికాగార్గ్, అనంతపురం జిల్లా ఎస్పీగా గౌతమిశాలిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అలాగే పల్నాడు జిల్లా కలెక్టర్ గా లట్కర్ శ్రీకేష్ బాలాజీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ముగిసిన తర్వాత పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో అల్లర్లు జరిగాయి. దీంతో ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు చేపట్టి మూడు జిల్లాల్లో ఉన్న ఎస్పీలను బదిలీ చేసింది. దీంతో ఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులు లేరని.. మూడు పోస్టులకు ఏపీ ప్రభుత్వం ఐదుగురు పేర్లతో కూడిన ప్యానల్‌ను పంపించింది. శనివారం ఉదయం మళ్లీ సీఎస్ జవహర్‌రెడ్డికి ఎన్నికల కమిషన్ లేఖ పంపించింది. ఒక్కో ఎస్పీ పోస్టుకు ముగ్గురు పేర్ల చొప్పున ప్యానల్ పంపాల్సిందేనని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఒక్కో ఎస్పీ పోస్టుకు ముగ్గురేసి అధికారుల పేర్లను సీఎస్ పంపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పల్నాడు, అనంతపురం, తిరుపతి ఎస్పీ పోస్టులకు ఎన్నికల సంఘం ఎస్పీలను నియమించింది. పల్నాడు జిల్లాకు కొత్త కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేశ్ బాలాజీని ఎన్నికల కమిషన్ నియమించింది. మరోవైపు ఇప్పటివరకు పల్నాడు కలెక్టర్‌గా ఉన్న తొలేటి శివశంకర్‌ను ఇటీవల ఈసీ బదిలీ చేసిన విషయం తెలిసిందే. పల్నాడులో జరిగిన హింసాత్మక సంఘటనలు నేపథ్యంలో శివశంకర్‌ను బదిలీ చేశారు.

# రాకేశ్ రెడ్డి మంచి ప్రజాసేవకుడు

## ఎమ్మెల్సీగా గెలిపించాలని కెటిఆర్ వినతి

**హైదరాబాద్,మే18:** ఈరోజు తెలంగాణకు కావలసింది అధికార స్వరాలు కాదు.. ధిక్కార స్వరాలు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ కేటీఆర్ ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి హన్మకొండ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ప్రతిష్టాత్మక బిట్స్ పిలానిలో విద్యాభ్యాసం చేశారు. మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్‌లో డ్యూయల్ మాస్టర్స్ డిగ్రీ పొందారు. అమెరికాలో ఏడేళ్ల పాటు పలు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగం చేసిన రాకేష్ రెడ్డి.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారని కేటీఆర్ తెలిపారు. అద్భుతమైన వాగ్దాటి, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డి.. సమకాలీన రాజకీయాంశాలపై, ఆర్థిక స్థితిగతులపై ప్రముఖ వార్తా పత్రికల్లో ఆర్టికల్స్ రాయడమే కాకుండా నవశకానికి నాంది, ప్రగతి రథ చక్రాలు, ఫిస్కల్ ఫెడరలిజం, ద డాన్ ఆఫ్ న్యూ ఎరా, తెలంగాణ ఎకానమీ లాంటి పుస్తకాలను రచించారు. సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇండియన్ ఎకానమీ, తెలంగాణ ఎకానమీపై గెస్ట్ లెక్చర్లు కూడా ఇచ్చారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద విద్యార్థుల కోసం రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్ అనే ఫ్రీ కోచింగ్ యాప్‌ను రూపొందించి ఉచితంగా అందజేశారు. హన్మకొండలో మెగా జాబ్ మేళాలు నిర్వహించారు. టీవీ చర్చల్లో చురుగ్గా పాల్గొని, విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యల, హక్కులపై బలంగా గళం విప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు. కరోనా మహమ్మారి సమయంలో, వరంగల్‌లో వరదలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలిచి తన వంతు సహాయాన్ని అందించారు.

ఇండస్ ఫౌండేషన్ ద్వారా ఓరుగల్లులో కూచిపూడి, పేరిణి లాంటి నృత్య కళలను, పల్లె సంస్కృతులను, సాహిత్యాన్ని, మన జానపద కళారూపాలను పరిరక్షించడం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న రాకేష్ రెడ్డి.. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సరైన చాయిస్. యువకుడు, ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించే తత్వం, లోతైన విషయ పరిజ్ఞానం ఉన్న రాకేష్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే.. పట్టభద్రుల గొంతుకగా నిలుస్తారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మీ మొదటి ప్రాధాన్యత ఓటు రాకేష్ రెడ్డికే వేసి.. వారిని గెలిపించాలని కోరుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.



# తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

**తిరుమల,మే18:** శ్రీవారి దర్శనానికి తిరుమలలో భక్తుల రద్దీ శనివారం కూడా కొనసాగింది. టోకెన్లు లేని భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. రింగు రోడ్డు మీదుగా శిలాతోరణం వరకు సుమారు 2 కిలోమీటర్ల వరకు క్యూలైన్లలో బారులు తీరారు. శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు తదితర సౌకర్యాలను అధికారులు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. తితిదే జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, తితిదే భద్రతాధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ రద్దీ మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఎన్నికలు ముగియడంతో భక్తులు తిరుమల దర్శనానికి వస్తున్నారు. దీంతో రద్దీ పెరుగుతోంది.

# ఎపిలో రాక్షసరాజ్యం అంతం

**- భారీ పోలింగ్ ద్వారా ప్రజాతీర్పు - టీడీపీ అభ్యర్థి సీఎం రమేష్**

**తిరుమల,మే18:** తిరుమల శ్రీవారి దయ వల్ల ఏపీలో రాక్షస రాజ్యం పోయి రామ రాజ్యం రానున్నదని అనకాపల్లి టీడీపీ అభ్యర్థి సీఎం రమేష్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలకు ముందే ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. శనివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దుర్మార్గ పాలన పోయి.. రాష్ట్రానికి మేలు జరిగే విధంగా ఏపీలో భారీగా పోలింగ్ జరిగిందన్నారు. చాలా కాలం తరువాత పోలీసులు వారు సక్రమంగా విధులు వారు నిర్వర్తించారన్నారు. కొంత మంది పోలీసుల్లో ఇంకా మార్పు రావాల్సి ఉందని సీఎం రమేష్ తెలిపారు. పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తే వైసీపీ వాళ్ళ గుండెల్లో రైలు పరిగెడుతాయని పేర్కొన్నారు. ఏపీలో పోలీసుల రాజ్యం పోయి ప్రజల రాజ్యం వచ్చిందన్నారు. కేడర్‌ని ఉత్సాహ పరచేందుకే జగన్ ఐప్యాక్.. బ్లూ ప్యాక్ అంటూ మభ్యపెడుతున్నాడన్నారని సీఎం రమేష్ పేర్కొన్నారు. ఇక ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఎంపీ సంతోష్ కుమార్, ఇన్ఫోసిస్ అధినేత సుధా నారాయణమూర్తి, చేవెళ్ళ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ ఆర్టీసీ ఎండి సజ్జనార్ తదితరులున్నారు.

# ప్రజ్వల్ కేసులో నోరు విప్పిన దేవేగౌడ

**ఈ కేసులో ఉన్న ఇతరులు కూడా శిక్షార్హులే**

**ఎవరు దోషులైనా తప్పించుకోరాదని వ్యాఖ్య**

**బెంగళూరు,మే18:** మనవడు, హాసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వీడియోల వ్యవహారంలో జేడీఎస్ అధినేత దేవెగౌడ మొదటిసారి స్పందించారు. ఈ కేసు నుంచి ఎవరూ తప్పించుకోకూడదన్నారు. ఇందులో చాలా మందికి ప్రమేయం ఉందని, వారిని కూడా వదిలిపెట్టకూడదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు జాతీయ మీడియాతో మాట్లాడారు. 'ప్రజ్వల్ ప్రస్తుతం దేశంలో లేడు. చట్టప్రకారం చర్యలు ఉండాలని ఇప్పటికే హెచ్‌డీ కుమారస్వామి చెప్పాడు. ఈ కేసులో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తుల పేర్లు చెప్పను కానీ.. వారిపై కూడా చర్యలు ఉండాలని దేవెగౌడ అన్నారు. ఇదిలా ఉంటే.. ప్రజ్వల్‌తో తనకు ఎలాంటి కాంటాక్ట్ లేదని కుమారస్వామి చెప్పారు. కర్ణాటకలో ఉన్న సమయంలో కూడా టచ్‌లో లేనన్నారు. అతడి వెంట పరిగెత్తాలా ఏంటని ప్రశ్నించారు. మరోపక్క, కిడ్నాప్ కేసుకు సంబంధించి కర్ణాటక మాజీ మంత్రి, ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణకు ఇటీవల బెయిల్ వచ్చింది. తనయుడి లైంగిక దౌర్జన్యం ఆరోపణలకు సంబంధించి బాధిత మహిళను అపహరించిన కేసులో మే 4న ఆయన్ను ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. అరెస్టు సమయంలో ఆయన అధికారులకు సహకరించలేదు. తన తండ్రి, మాజీ ప్రధాని దేవెగౌడ నివాసంలో ఉన్న ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు రాగా.. సాయంత్రం 5.17 గంటల నుంచి 6.50 గంటల వరకు సరైన సమయం కాదని, ఇంట్లో తలుపు వేసుకుని కూర్చున్నారు. సాయంత్రం 6.50 తర్వాత ఆయనే తలుపు తీసి, సిట్ అధికారుల ముందు లొంగిపోవడం గమనార్హం. ఇక, ప్రజ్వల్‌ను స్వదేశానికి తీసుకువచ్చే ప్రయత్నాలు మాత్రం ఫలించలేదు.

# నగరంలో మరో రియల్టర్ మోసం

**ప్రీలాంచ్ పేరుతో 60 కోట్లు దండుకున్న బిల్డర్**

**ప్రజల ఫిర్యాదుతో పలువురి అరెస్ట్**

**హైదరాబాద్,మే18:** మరో రియల్ మోసం బయటకు వచ్చింది. ఇప్పటికే రియల్‌ర్ల మోసాల కారణంగా చిక్కులు వస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో మరో ప్రీ-లాంచ్ ఆఫర్ మోసం బయటపడింది. భారతీ లేక్‌వ్యూ పేరుతో తక్కువ ధరకే ప్లాట్స్ అంటూ నమ్మించి కోట్లు దండుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొంపల్లిలో భారతీ లేక్‌వ్యూ ప్రీ-లాంచ్ పేరుతో భారతీ బిల్డర్స్ చైర్మన్ దూపాటి నాగరాజు ఆఫర్ ప్రకటించారు. అతి తక్కువ ధరకు ప్లాట్స్ అంటూ 350 మంది నుంచి భారీగా వసూళ్లు చేశాడు. దాదాపు రూ. 60 కోట్ల వరకు జనం నుంచి వసూళ్లు చేశాడు నాగరాజు. అయితే డబ్బులు వసూలు చేసి నిర్మాణం చేపట్టలేదు . దీంతో భారతీ బిల్డర్స్‌పై సైబరాబాద్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సైబరాబాద్ ఎకనమిక్స్ అఫెన్స్ వింగ్ పోలీసులు నాగరాజుతో పాటు భారతీ బిల్డర్ ఎండీ శివరామకృష్ణ, సీఈఓ నరసింహరావులను అరెస్ట్ చేశారు.

# ఎపిలో వైకాపా ఓటమి ఖాయం

**- టిడిపి గెలిస్తే అది వైసిపి వ్యతిరేక ఓటు ఫలితమే**

**- దేశంలోనూ ఇండియా కూటమిదే అధికారం: రామకృష్ణ**

**రాజమండ్రి,మే18:** ఏపీలో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అందరికీ తెలిసిందే అని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ.. వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు మారతాయని ఇండియా కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసంగా చెప్పుకొచ్చారు.. అయితే, టీడీపీకి అధికారం వస్తే అది బీజేపీతో పొత్తు వల్ల కాదు.. కేవలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతోనే తెలుగుదేశం పార్టీకి అధికారం రావొచ్చని వ్యాఖ్యానించారు. మరోవైపు.. పోలీస్ అధికారుల బదిలీ, సస్పెన్షన్లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.. పోలీస్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆయన.. సిట్ విచారణ సమగ్రంగా జరగాలన్నారు. మరోవైపు.. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరం కూల్చి చేస్తారనేది అవాస్తవం అని క్లారిటీ ఇచ్చారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని జోస్యం చెప్పిన ఆయన.. ఏపీలో కూటమి గెలుపు ఖాయం అన్నారు. ఈ నెల 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ జరగగా.. వచ్చే నెల ఫలితాలు వెల్లడికానున్న విషయం విదితమే. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపుపై ఎవరి లెక్కలు వాళ్లకు ఉన్నాయి.

# సిఎం రేవంత్‌తో సినీ దర్శకుల భేటీ

**హైదరాబాద్,మే18:** ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్‌ను తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించబోతోంది. ఈ వేడుక రావాల్సిందిగా అసోసియేషన్ సభ్యులు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్, వైస్ ప్రెసిడెంట్ వశిష్ట, దర్శకులు అనిల్ రావిపూడి, హరీశ్ శంకర్ శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానాన్ని అందజేశారు.

# మోడీ వల... జనం గిలగిల !

సార్వత్రిక ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. మరో మూడు విడతల్లో ఎన్నికల ప్రహసనం ముగియ నుంది. ప్రచారంలో నేతలు పరస్పర ఆరోపణలు, నిందలు వేసుకుంటున్నారు. కానీ ఎక్కడా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగడం లేదు. అధికార బిజెపి ఈ విషయంలో ముందున్నది. ఎక్కడా పెరుగుతున్న ధరల గురించి గానీ, నిరుద్యోగం, జివిస్టీ భారం తదితర అంశాలను ప్రస్తావించడం లేదు. ప్రభుత్వరంగ సంస్థ అమ్మకాలపైనా ఇప్పుడు మాట్లాడడం లేదు. అందరినీ వంచించి, కాంగ్రెస్‌ను తిడుతూ మోడీ ద్వయం కాలక్షేప ప్రచారాలు చేస్తున్నారు. వారి ప్రచారానికి ప్రజలు ఓట్లేస్తారు. మోడీ హ్యాట్రిక్ సాధిస్తారు. కానీ మోడీ గెలిచినా..ఓడేది మాత్రం ప్రజలే అని గుర్తించాలి. ఈ క్రమంలో గతంలో స్విస్ బ్యాంక్‌లో దాచిన నల్లడబ్బు ను తెచ్చి ప్రజల అకౌంట్లలో వేస్తామని అన్నారు. ఏటా కోటి ఉద్యోగాలని అన్నారు.అలాగే ధరలను అదుపు చేస్తామని అన్నారు. అలాగే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి, వ్యవసాయాన్ని పండగ చేస్తామని అన్నారు. ఇవేవీ అమలు కాలేదు. అడిగితే సమాధానం లేదు. అయినా ప్రజలు అడగలేక పోతున్నారు. తాజాగా మోడీ మరో ప్రకటన చేశారు. అవినీతి కేసులకు సంబంధించి ఈడీ స్వాధీనం చేసుకున్న నోట్ల కట్టలపై ప్రధాన మంత్రి మోడి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ సొమ్మంతా పేదలకే పంచిపెడతామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కొందరు వ్యక్తులు అధికార బలంతో తమ పదవులను దుర్వినియోగం చేసి పేదల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. ఆ డబ్బంతా తిరిగి వారికి చెందాలని కోరుకుంటున్నానన్నారు. ఇందుకోసం న్యాయబృందం సలహా కోరుతామన్నారు. చట్టపరంగా మార్పులు చేయాల్సి వస్తే దానికీ వెనుకాడబోమని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకున్న సొత్తును ఏం చేయాలో సలహా ఇవ్వాలని, ఇప్పటికే న్యాయవ్యవస్థను కోరామని ప్రధాని వెల్లడించారు. నిజంగా ఇంతకన్నా వంచన మరోటి ఉంటుందా..నిజానికి ఇది పట్టుబడ్డ డబ్బు. ప్రభుత్వానికి ప్రజలు రక్తం చిందించి జివిస్టీ రూపంలో కడుతున్న డబ్బు గురించి మాట్లాడడం లేదు. మోడీ నిర్ణయాల కారణంగా నిర్మాణ రంగం కుదేలయ్యింది. హైదరాబాద్ లాంటి నగరాల్లో ఒక్క ఫ్లాట్ కొనాలంటే కోటి రూపాయలు కావాలి. దానికి 5శాతం జివిస్టీ అంటే 5 లక్షలు కట్టాలి. స్టీలు, సిమెంట్ ధరలు ఆకాశం వైపు దూసుకుని వెళుతున్నా అడ్డుకోవడం లేదు. కందిపప్పు 175 రూపాయాలకు కిలో అయ్యింది. పెసరపప్పు 150గా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ధరలు దాడులు చేస్తున్నారు. అయినా ఈ విషయాలను ప్రధాని ఎక్కడా ప్రస్తావించడం లేదు. ధరలను అదుపుచేసే పనితనది కాదన్నట్లుగా పాలన సాగించారు. పదేళ్లుగా ధరలదాడితో సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. ఇలా ధరలదాడిని అరికట్టకుండా..ఇడి డబ్బులను పంచిపెడతానని కొత్తగా మభ్య పెట్టడం దారుణం కాక మరోటి కాదు. ఇవన్నీ చేయకుండానే మూడోసారి గెలుపు తమదేనని కోరుకుంటున్నారు. . 400 సీట్లు గెలుస్తామని ప్రజలే తమలో విశ్వాసం నింపారనీ.. వాళ్ల దృక్పథం తనకు తెలుసునన్నారు. 2019 ఎన్నికల నుంచే తమ కూటమికి 400 స్థానాల మెజార్టీ ఉందని చెప్పారు. ఈసారి 400 మార్క్ దాటాలని తమ నేతలకు చెప్పాం అని మోడి వివరిస్తున్నారు. ఇకపోతే సార్వత్రిక ఎన్నికల సమరం కీలక దశకు చేరుకున్న క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయన హోదాను సైతం మరిచి యాట్లాడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎస్పీతో కూడిన విపక్ష ఇండియా ఫోరం గెలిస్తే అయోధ్యలో రామమందిరాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. గతంలో బిజెపి అగ్రనేతలు వాజ్‌పేయ్, అద్వానీలు ఇలా దిగజారి ఎప్పుడూ మాట్లాడలేదు. ఓట్ల కోసం మోడీ పడుతున్న తాపత్రాయనికి ఇది పరాకాష్టగా చూడాలి. 'ఇండియా' కూటమి విజయం సాధిస్తే అయోధ్య రాముడు మళ్లీ టెంట్‌లోకి మారతాడని ఆరోపించారు. ఇలాంటి ప్రచారాలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచించాలి. కరోనా అనంతరం ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నా మోడీ పట్టించుకోవడం లేదు. మోడీ చాయ్ అమ్మిండన్న వాదనే తప్ప ఆయనకు సామాన్యుల కష్టాలు పట్టడం లేదు. పెట్రో ధరలతో దాడి చేస్తూ మోడీ సుద్దులు పలుకుతున్నారు. పెట్రో ధరలతో అన్ని రకాల ధరలు పెరిగి సామాన్యులు బతకడం భారంగా మారింది. ప్రజలు నెత్తీనోరూ మొత్తు కుంటున్నా.. మోడీ తీరులో చలనం రావడం లేదు బిజెపి అధికారంలోకి వస్తే మార్పు వస్తుందనుకుంటే పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మోడీ, అమిత్ షాల ద్వయం పాలన సాగుతోంది. బిజెపిలో పెద్దరికం లేకుండా చేసి నిరంకుశ పాలనతో భారత్‌ను ఆర్థికంగా అధోగతి పాల్జేస్తున్న తీరు క్షంతవ్యం కాదు. ఇకపోతే ఏ పన్ను విధించినా అది నేరుగా ప్రజలపైనే పడుతుందని, దానివల్ల ప్రజలు ఎంతగా ఇబ్బంది పడుతున్నారో అని గుర్తించకుండా కేవలం జివిస్టీ పరమౌషధం అన్న విధంగా ప్రచారం చేస్తూ వచ్చి ప్రజల నడ్డి విరిచారు. భారతదేశంలాంటి దేశంలో 18శాతం జివిస్టీ అవసరమా అన్న ఆలోచన చేయడం లేదు. కేవలం 5శాతం సరిపోతుందని, అప్పుడు ఎక్కువ మంది జివిస్టీ పరిధిలోకి వచ్చే అవకాశాలు పెరుగు తాయని, ఆర్థిక నిపుణులు



మొత్తుకుంటున్నా పట్టించుకోని మోడీ సర్కార్, జివిస్టీ గురించి చంకలు గుద్దుకుంటే సరిపోదు. అతిపెద్ద ఆర్థిక సంస్కరణ అంటున్న ప్రధాని మోడీ దివంగత ప్రధాని పివి నరసింహా రావు ఆర్థిక సంస్కరణలతో పోల్చుకోవాలి. ఆయన చేపట్టిన సంస్కరణలు ప్రజలకు ఎలా చేరగలిగాయో ఆలోచన చేయాలి. పివికి భారతరత్న ఇచ్చామని చెప్పుకోవడం కన్నా ఆయన ఆచరించిన ఆర్థిక విధానాలను అనుసరించాలి. ఇబ్బడి ముబ్బడిగా పన్నులు వసూలు చేసి ఓటుబ్యాంకు కోసం పథకాలు ప్రకటించి వాటికి ఖర్చు చేయడం మంచిది కాదు. మోడీ తన చౌకబారు విమర్శలను మానాలి. హుందాగా మాట్లాడాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో అదే చర్చ చేయాలి. ధరల అదుపునకు తీసుకోబోయే చర్యల గురించి ఎన్నికల్లో మాట్లాడాలి. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. అది జరగనంతకాలం మోడీ హ్యాట్రిక్ సాధించినా ..ప్రజలు మాత్రం జీవితంలో ఓడిపోతారని గుర్తించాలి.

# ఉచిత పథకాలపై పునరాలోచన చేయాలి

## - ఉపాధిని నిర్మాణాత్మక రంగానికి జోడించాలి - జివిస్టీ స్లాబులపై పునరాలోచన చేయాలి

**న్యూఢిల్లీ,మే18:** వివిధ ఉచిత పథకాలను పునరాలోచన చేయాలి. ఉపాధి హామీ వల్ల వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. వాటి కారణంగా గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థ చితికి పోయింది. పనిచేయకున్నా కూలి వస్తోందన్న ధీమాతో ఇతరత్రా కూలీలకు వెళ్లడం లేదు. దీనిని నిర్మాణాత్మక పనులకు అనుసంధానం చేయడం ద్వారా ఆస్తులను సృష్టించే పథరకంగా మార్చాలి. విద్య,వైద్య రంగాలు, కమ్యూనికేషన్, రోడ్లు రవాణా రంగం అభివృద్ధి చేసి, ప్రజలు స్వయం సమృద్ధి సాగించేలా పాలన సాగించాలన్న ఆలోచన చేయడం లేదు. వనరులను ఉపయోగించి దేశాన్ని ఆర్థికంగగా బలోపతేం చేయాలన్న సంకల్పం కానరావడం లేదు. రాష్ట్రాలు కూడా ప్రజాకర్షక పథకాలతో డబ్బుల పందేరం చేయడం ద్వారా..ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా అవుతున్నాయి. ఇలాంటి దుబారా పథకాలపై కేంద్రం అజమాయిషీలో నియంత్రణ ఉండాలి. పండగలు, పబ్బాలు, కులాలు,మతాల పేరుతో డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేయకుండా, కేవలం అభివృద్ధి పథకాలకు మాత్రమే ఖర్చు చేయగలగాలి. జివిస్టీ ఆమోదించినప్పుడే వ్యక్తం అయిన అభ్యంతరాలను గమనించి పెద్దమొత్తంలో పన్నుల విధింపును భారంగా గుర్తించి ఆలోచన చేసివుంటే బాగుండేది. తొలుత వసూళ్లకు అలవాటు పడి ,ఇప్పుడు జివిస్టీ తగ్గింపు వల్ల నష్టం వస్తోందని ప్రకటించడం కేవలం వ్యాపారధోరణి తప్ప మరోటి కాదు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునేముందు నిపుణులతో చర్చించాలి. ఇలా చెబుతూ పోతే జివిస్టీ ధరాఘాతాలపై పుస్తకాలే రాయొచ్చు. అయితే జివిస్టీ అమలు కోసం తొందరపాటు ప్రదర్శించిన సమయం లోనే దీనిపై సవాలక్ష అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నాయని విపక్షాలు గగ్గోలు పెడుతున్నా, వ్యాపారులు ఆందోళన చేస్తున్నా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ సర్కార్ దూకుడుగా అమలు చేసింది. అనేక అంశాలపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసినా అవి చెల్లుబాటు కాలేదు. జీఎస్‌టీకి అమలుకు కేంద్రం వ్యవహరిస్తున్న తీరే తమను ఆందోళనకు గురిచేస్తోందని పలు రాష్ట్రాలు చెప్పినా ఫలితం లేకుండా పోయింది.కేవలం వ్యాపార ధోరణితో తీసుకున్న నిర్ణయం తప్ప పాలనా సంస్కరణ అనడానికి లేకుండా చేశారు. నేటికీ వ్యాపారుల్లో ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వర్తకులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదు. చివరకు చేనేత లాంటి రంగాలపైనా జివిస్టీ వేయడం దారుణం కాక మరోటి కాదు. నోట్లరద్దు సమయంలో వ్యవహరించిన తొందరపాటునే ఇక్కడా ప్రదర్శిస్తున్నారు. దుష్పరిణామాలు వస్తున్నా సరిదిద్దుకోవడం లేదు. జివిస్టిపై చిన్న, మధ్యతరగతి వ్యాపారులు ఆందోళనతో ఉన్నారు. అభ్యంతరాలకు అవకాశం ఇవ్వకుండా ఒకే దేశం ఒకే పన్ను విధానం అంటూ అమలులోకి తీసుకుని వచ్చాక గానీ ప్రజలకు జివిస్టీ అంటే ఏమిటో తెలిసింది. ఏకీకృత పన్ను విధానం అమల్లోకి వచ్చిందే తప్ప ఆర్థిక సంస్కరణలు అనడానికి వీల్లేకుండా చేసింది. ఇలాంటి పాలకులు చేస్తున్న విన్యాసాలకు ప్రజలు బలవుతున్నారు. కరోనా తరవాత ప్రజలు ఆర్థికంగా కుంగిపోయారు. చేయడానికి పనులు లేక బతుకీడుస్తున్నారు. చాయ్ అమ్మిన వారికి సామాన్యుల కష్టాలు తెలుస్తాయని అంటారు. కానీడబ్బున్న వాడికి ఊడిగం ఎలా చేయాలో మన నేతలు చేసి చూపిస్తున్నారు. ఇప్పటికైనా మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే ఆయారంగాలపై సమీక్షించుకోవాల్సి ఉంటుంది.

# గృహనిర్మాణ రంగానికి గడ్డుకాలం

## - పభుత్వం తీరుతో కోలుకోని నిర్మాణరంగం - సామాన్యులకు దూరంగా ప్రభుత్వ నిర్ణయాలు

**న్యూఢిల్లీ,మే18:** కేంద్రం జివిస్టీపై తీసుకుంటున్న కఠిన చర్యల కారణంగా నిర్మాణరంగం పూర్తిగా సంక్షోభంలో పడింది. సామాన్యులు అసలు ఇల్లు కొనాలన్న ఆలోచనలో లేరు. ప్రభుత్వాలు కట్టించే ఇంటి కోసం ఎదురు చూస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో డబుల్ ఇళ్లకు డిమాండ్ పెరిగింది.నిర్మాణరంగానికి అత్యంత కీలకమైన సిమెంటు, స్టీల్, పెయింట్లను మాత్రం విలాస వస్తువుల జాబితాలో ఉంచడం వల్ల నిర్మాణ రంగం కుదేలయ్యింది. సామాన్యులు ఇంటిని కట్టుకునే అవకాశం లేకుండా చేశారు. అలాగే ఇప్పుడు తెలంగాణలో భూములు ధరలు పెంచడం, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు కూడా మరింత భారం కాబోతున్నది. ధరాఘాతం కారణంగా కొనుగోలు శక్తి నశించింది. అందువల్ల పేదలు తమకు కూడా ఓ ఇల్లు కావాలసి సర్కార్ వైపు చూస్తున్నారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లకోసం ఆశపడుతున్నారు. సొంత జాగా ఉన్న వారికి ఐదులక్షల సాయం ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి దానిని పెంచుతారేమో అన్న ఆశలో ప్రజలు ఉన్నారు. ఎపిలోనూ జగనన్న కాలనీలతో హడావిడి జరిగింది. గృహనిర్మాణ రంగానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇస్తే తప్ప సామాన్యుల ఇంటికల నెరవేరదని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. సిమెంట్, స్టీలు, గృహసంబంధ వస్తువులపై జివిస్టీ 18 శాతం జివిస్టీ కారణంగా వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. హైదరాబాద్ లాంటి నగరంలో కోటి లేనిదే ఓ డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ రావడం లేదు. పేదలు, మధ్యతరగతి వారికి గృహ నిర్మాణం భారం అయ్యిందన్న ఆందోళనలను జివిస్టీ మండలి పక్కన పెట్టింది. పన్ను అధికమయితే నల్లబజారు బెడద కూడా పెరుగుతుందని వస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ రంగ వస్తువులపై తలకు మించిన పన్ను వేయడం వల్ల దాని భారం నేరుగా ప్రజలపై పడుతుంది. ఇల్లు కొనుక్కోవాలన్న తపనలో ఉన్న వారికి మరింత భారం అవుతోంది. పన్ను చెల్లింపు విధానాన్ని మరింత సరళతరం చేయాలని, జీవిస్టీ నెట్‌వర్క్‌లో ఉన్న ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నా పట్టించుకోకుండా పెడ ధోరణిలోనే ముందుకు సాగడం కారణంగా విపరీత పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. పెట్రోలు, డీజిల్, సహజవాయువు, విమాన ఇంధనం, ముడి చమురును కూడా జీవిస్టీ పరిధిలోకి తీసుకురావాలని ప్రజలతో పాటు పార్టీలు కూడా కోరుతున్నారు. పెట్రోలియం ఉత్పత్తులను, ఆల్కహాల్‌ను జీవిస్టీ పరిధిలోకి తీసుకుని రావాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రత్యేక విధానం ఉండాలని అభిప్రాయదుతున్నారు. ప్రస్తుతం ప్రతి నెలా మూడు రకాల రిటర్నులు సమర్పించే బదులు, మూడు నెలలకు ఒకసారి సమర్పిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే గృహనిర్మాణం పై పన్నులు తగ్గించకపోవడం సరికాదు. దీనిపై తక్షణం పునరాలోచన చేయాలి. దీనిపై ఆదాయాన్ని ఆశించడంతో గృహనిర్మాణ రంగం కుదేలు అవుతోంది. ఇకపోతే చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై భారం మోపకూడదని, అసంఘటిత రంగాన్ని తొక్కిపెట్టకూడదని పలువురు పేర్కొంటున్నారు. నిర్మాణరంగంతో పాటు, అనుబంధ రంగాల్లో 5శాతం పన్ను మాత్రమే ఉంటే సామాన్యులకు మేలుకలుగుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే ఇప్పటికైనా ఇలాంటి వస్తువులపై పన్ను భారం తగ్గించకుంటే దేశంలో గృహనిర్మాణ రంగం కేవంల పెద్దలకు మాత్రమే ప్రత్యేకమని చెప్పుకోవాల్సి వస్తుంది. జీవిస్టీ మండలి చేసిన సిఫార్సులు మన పౌరులకు మరింత మేలు చేస్తాయన్న వాదననుంచి కేంద్రం బయట పడాలి. జీవిస్టీని బలోపేతం చేస్తాయి. కేంద్రం అహంకారాన్ని విడిచిపెట్టి తప్పు దిద్దుకోవాలని, దేశ ప్రజలు చెబుతున్న విషయాన్ని వినాలి. ప్రభుత్వం చిన్న మధ్య తరహా వ్యాపారాల వెన్ను విరిచిందని, లక్షలాది ఉద్యోగాలను పోగొట్టిందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. సర్వమంత్రం అయిన జివిస్టీ ఓ రకంగా ప్రజల నిత్య జీవితాల్లో చీకట్లు నింపుతోందని ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.

# ధాన్యం కొనుగోళ్లలో ఉదాసీనత

**హైదరాబాద్,మే18:** అకాల వర్షాల కారణంగా తెలంగాణలో రైతులు తీవ్రంగా నష్టపోయారు,. కల్లాల్లోనే రోజుల తరబడి ధాన్యం. పడివు ఒడడంతో వర్షాలకు తడిసి ముద్దయ్యింది. ధాన్యం సేకరణలో ప్రబుత్వం విఫలమ్యిందని అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. తాజాగా పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ రాజీనామా డిమాండ్ తెరపె_కి వచ్చింది. రాజీనామా చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. ధాన్యం కొనుగోళ్లో మంత్రిఒ ఉత్తమ్ నిర్లక్ష్యం కారణంగానే రైతులు నష్టపోయారని బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర రెడ్డి చేసిన డిమాండ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీయకపోగా... అధికారులను ప్రశ్నించి, పరుగు పెట్టించాల్సిన మంత్రి పట్టించరుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఒరాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నేతృత్వంలోనే ధాన్యం కొనుగోళ్ల పక్రియ కొన సాగుతున్నది. కొనుగోళ్లు మందకొడిగా సాగకుండా ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేయాల్సిన ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పత్తా లేకుండా పోయారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటన్నింటిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పరిష్కార మార్గాలను సూచిస్తూ, అధికారులను ముందుకు నడిపిస్తూ, కొనుగోళ్ల పక్రియ వేగవంతం

# పోలవరం నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం

### మాయమాటలుచెబుతున్న వైసిపి,బిజెపిలు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు వెల్లడి

**ఏలూరు,మే18** పోలవరం నిర్వాసిత గ్రామాల్లో సమస్యలపై గత పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పట్టించుకోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ముంపు గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించకుండా మాయమాటలు చెప్తూ ముంపు గ్రామాలకు వస్తోన్న నాయకులను ప్రజలు ఎక్కడికక్కడే నిలదీయాలని పిలుపు నిచ్చారు. పోలవరం ప్రాజెక్టు వల్ల రంపచోడవరం నియోజకవర్గంలోని ఐదు ముంపు మండలాల ప్రజల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి కష్టాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని అన్నారు. నిర్వాసిత కాలనీలు సరిగాలేవని, కనీస సౌకర్యాలు కరువవ య్యారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కాఫర్ డ్యాం నిర్మాణం వల్ల దేవీపట్నం మండలంలోని అనేక గ్రామాలు మునిగి పోతాయని తెలిపారు. పోలవరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వాల్సి ఉందన్నారు. దీనిపై మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్రంలోని వైసిపి, టిడిపి నిలదీయడం లేదని తెలిపారు. బిజెపి కపట నాటకాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. పునరావా సానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని శ్రీనివాసరావు విమర్శించారు. దీనిలో భాగంగా రెండు పూటల పని విధానాన్ని అమలు జరుపుతోందన్నారు. గిరిజన ప్రాంతంలో కూలీలు ఒక పూట పొలం పనులు చేసుకుంటూ మరొక పూట ఉపాధి పనులకు వెళ్తుంటారని తెలిపారు. వీరికి ఉపాధి పనులు ఎంతో ఆసరాగా ఉండేవని, ఇప్పుడు రెండు పూటలా ఉపాధి విధానం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు లేవని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో 200 రోజులు పని దినాలు కల్పించాలని, ఒక పూట మాత్రమే ఉపాధి పనులు పెట్టాలని, కనీస వేతనం అమలు చేయాలని, పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలూ కల్పించాలని డిమాండ్ చేశారు.

# చినుకు పడితే రంగురాళ్ల వేట

**కర్నూలు,మే18:** చినుకు పడిందంటే రైతులకే కాదు.. మరికొందరికి కూడా ఆనందమే. అక్కడి ప్రజలు వరుణిడి కరుణ కోసం రైతుల కంటే ఎక్కువగా ఎదురు చూస్తూ ఉంటారు. వరుణిడి రాక తమ జీవితాల్లో వెలుగును తీసుకొస్తుందని ఆశగా ఆకాశం వంక ఎదురు చూస్తూ ఉంటారు. చినుకు పడితే ఇక వారంతా రంగురాళ్ల వేటలో పడతారు. కర్నూలు జిల్లాతో పాటు దాని పరిసర ప్రాంత ప్రజలు. వారికి ఏమవసరం అంటే.. వజ్రాల దొరుకుతాయని ఓ నమ్మకం. గతంలోనూ ఇలా దొరికిన సందర్భాలు కోకొల్లలు. రెండు రోజులుగా తొలకరి జల్లులు కురవడంతో ఇక్కడి ప్రజలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. వెంటనే కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి వెళ్లి వజ్రాల అన్వేషణను ప్రారంభించారు.

# మేడిగడ్డ రిపేర్లలో ఆలస్యంగా నిర్ణయం

### వర్షాకాలం ముంచుకొస్తున్న వేళ సమయం వృధా

**హైదరాబాద్,మే18:** ఎన్నికలతో పాటు, కొంత ఉదాసీనత కారణంగా మేడిగడ్డ వద్ద రోణ చర్యలకు ఆలస్యంగా అయినా నిర్నయం తీసుకున్నారు. ఈయేడు త్వరగా రుతుపవనాలు వస్తాయని అంటున్నారు. మరో పక్షం రోజులే ఇందుకు గడువు ఉంది. వర్షాలకు ముందే మరమ్మత్తులు చేస్తేనే నీటిని ఎత్తి పోయడానికి అవకాశం ఉంటుంది. ఈ పదిహేను రోజుల్లో ఇది పూర్తవుతుందా అన్నదే అనుమానం. వర్షాకాలంలో మేడిగడ్డ బరాజ్ వద్ద చేపట్టాల్సిన రక్షణచర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ చేసిన మధ్యంతర సిఫారసులకు సంబంధించిన పనులను ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రారంభించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల రక్షణకు చేపట్టాల్సిన సత్వర పనులపై ఇరిగేషన్‌శాఖ ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఈఎన్సీ జనరల్, ఈఎన్సీ (ఓఅండ్‌ఎం), సీఈ (సీడీవో), రామగుండం సీఈతో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటయిన జ్యుడీషియరీ కమిషన్‌కు ఇప్పటివరకు 3 ఫిర్యాదులు మాత్రమే అందాయి. ప్రాజెక్టుపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు కమిషన్ ప్రత్యేకంగా బాక్సులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31 వరకు ఈ పక్రియ కొనసాగనుంది. ఫిర్యాదులు చేసేవారెవరైనా సరే సాక్ష్యాలతో అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. దీంతో ఫిర్యాదులు ఎక్కువగా రాలేదని తెలిసింది. కాగా కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ జూన్ 6న రాష్ట్రానికి రానున్నారని సమాచారం.ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులను గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా ఆదేశాలు జారీ చేశారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై ఇప్పటికే ప్రత్యేకంగా కమిటీని వేయగా నివేదికను సైతం సమర్పించింది. ఈ నేపథ్యంలో మరోసారి ఎస్‌ఎల్‌బీసీ పనుల ప్రారంభంపై ఇరిగేషన్ సెక్రటరీ శుక్రవారం నిర్మాణ ఏజెన్సీలు, ఇంజినీర్ అధికారులతో చర్చించారు.బరాజ్‌లోని బ్లాక్-7లో 8 గేట్లను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టింది. వరద ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూడాలని, అందుకు గేట్లను పూర్తిగా తెరచి ఉంచాలని, ఆటంకంగా మారిన ఇసుకమేటలు, రాళ్లను తొలగించాలని ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచించించింది. అందుకు సంబంధించిన పనులను చేట్టాలని బరాజ్ నిర్మాణ ఏజెన్సీకి ఇరిగేషన్‌శాఖ ఇటీవలనే ఆదేశాలను జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏజెన్సీ మొత్తం 8 గేట్లలో ఇప్పటికే ఒక గేటును ఎత్తి పెట్టింది. మరో 2 మినహా మిగతా గేట్లను సైతం సాంకేతిక ఇబ్బందులు లేకుండానే ఎత్తే అవకాశముందని ఎల్‌అండ్‌టీ అధికారులు వెల్లడిస్తున్నారు. పగుళ్లు ఏర్పడిన 20వ పిల్లర్, దానిపక్కన ఉన్న పిల్లర్ గేట్లను ఎత్తడంలోనే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడుతున్నది. బరాజ్‌కు దిగువన, ఎగువన పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగిస్తున్నది. రాఫ్ట్ కింద ఉన్న రంధ్రాలను ఇసుక, సిమెంట్‌తో గ్రౌటింగ్ చేసేందుకు, షీట్ పైల్స్‌ను వేసేందుకు సైతం సంసిద్ధమైంది.

# అకాల వర్షాలతో చల్లబడ్డ వాతావరణం

**హైదరాబాద్/విజయవాడ,మే18:** తెలుగు రాష్ట్రాల్లో సూర్యతాపం తగ్గింది. అడపాదడపా అకాల వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వారం రోజుల వరకు ఉక్కపోతతో చంపేసిన వాతావరణం ఇప్పుడు కాస్త శాంతించింది. మూడు రోజుల నుంచి సాయంత్రం వేళలలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉక్కపోత ఉన్నప్పటికీ గతంలో ఉన్న వేడి మాత్రం లేదు. ఐఎండీ సూచినల ప్రకారం మరో నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం ఉంటుంది. రాయలసీమకు ఆనుకొని ఉత్తర తమిళనాడు మీదుగా ఆవర్తనం ఏర్పడింది. దీని కారణంగా ఛత్తీస్‌గడ్ నుంచి ద్రోణి విస్తరించి ఉంది. దీని కారణంగా వర్షాలు పడే ఛాన్స్ ఉంది. నాలుగు రోజుల పాటు వర్షాలు పడొచ్చిన వాతావరణ శాఖ తెలిపింది.వర్షాలు కురిసే అవకాశం ఉన్న ప్రాంతాలు: తూర్పుగోదావరి, పార్వతీపురం, పశ్చమగోదావరి, కోనసీమ, బాపట్ల, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, తిరుపతి, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లా, అనంతపురం, నంద్యాల కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో వర్షాలు పడతాయి. ఉరుములు మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడతాయి. గురు శుక్రవారం కూడా బాపట్ల, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, సత్యసాయి, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో 131 సెంటీమిటర్ల నుంచి 43 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదు అయింది. యరో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతోంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. మధ్యప్రదేశ్‌కు ఆనుకొని ఉన్న సైక్లోనిక్ సర్క్యులేషన్, చత్తీస్‌గఢ్, తమిళాడు మధ్య ఉన్న మరో ఆవర్తనం కారణంగా తెలంగాణలో వాతావరణం చల్లబడింది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు మరికొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎల్లో అలర్ట్ జారీ చేసిన జిల్లాలు:- గద్వాల్ జిల్లా, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట, జనగామ, భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి

## రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీఎస్ ఎప్ సెట్ పరీక్షా ఫలితాలు





**కూకట్పల్లి:మే18,** నేడు యూనివర్సిటీ జూబ్లీ హాల్ లో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తోపాటు ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబద్రి ఫలితాలను విడుదల చేశారు.ఎప్ సెట్ పరీక్షకు 3 లక్షల 31 వేల 251 మంది విద్యార్థులు హాజరయ్యారు.అందులో 2 లక్షల 40 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కు అప్లై చేశారని తెలిపారు. 93 వేల మంది విద్యార్థులు అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సులకు అప్లై చేశారని తెలిపారు. ఈసారి ఇంజనీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సత్యవాడ జ్యోతిర్ ఆదిత్య 155.63 మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా అగ్రికల్చర్ విభాగంలో ఆలూర్ ప్రణీత 146.44 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం వెల్లడించారు. ఫలితాలలో ఉత్తీర్ణత సాధించిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే కమిటీని ఏర్పాటు చేసి కౌన్సిలింగ్ కి సంబంధించిన తేదీలను వెల్లడిస్తామని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేటి నుంచి ఎప్ సెట్ పరీక్షలు జరుగుతున్నాయని కానీ తెలంగాణ రాష్ట్రంలో పరీక్షలు పూర్తిచేసుకుని నేడు ఫలితాలు విడుదల చేశామని అన్నారు దీనికోసం కృషి చేసిన ప్రతి ఒకరిని ప్రత్యేకంగా అభినందించారు

## మంచినీటి బోర్ ఏర్పాటు కి కొబ్బరికాయ కొట్టిన కార్పొరేటర్ ఆవాల రాధిక -నరోత్తం రెడ్డి



**కాజీపేట: మే 18,** హనుమకొండ జిల్లా మడికొండ పట్టణం 64 డివిజన వడ్డెర సంఘం కాలనీలో బోర్‌వెల్ మంచినీటి బోరు ఏర్పాటు పనుల కు స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధిక నరోత్తం రెడ్డి బోరువెల్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వడ్డెర సంఘం కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని పల్లపు యాదగిరి దృష్టికి కాలనీవాసులు తీసుకురావడంతో తన సొంత ఖర్చులతో సుమారు లక్ష రూపాయలు వ్యయంతో రెండు బోర్‌వెల్ శ్రీమెట్టు రామలింగేశ్వర స్వామి వడ్డెర కాంట్రాక్టు కో-ఆపరేటివ్ సొసైటీ సంఘం మడికొండ అధ్యక్షుడు పల్లపు యాదగిరి వేయించారు. కాలనీ వాసులు , మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో , సోషల్ మీడియా ఇన్చార్జ్ నర్మేట బిక్షపతి గాండ్ల, పల్లపు రాజుకుమార్, పల్లపు కుమార్ రాజ్, పల్లపు అశోక్,కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ లో ఆకస్మిక తనిఖీ



**బెజ్జూరు:** బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం డిసిఓ బి. మోహన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డు రిజిస్టర్లకి, ఆన్లైన్ ఎంట్రీకి సరైన పొంతనలేదని మండిపడ్డారు. ఈ వర్షాకాలం సమయానికి మండలంలోని రైతులకు ఎరువులు, విత్తనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మే 31 లోపు కార్యాలయంలోని రికార్డులు సరే చేసి ఉంచాలని ఉద్యోగులను ఆదేశించారు. కార్యాలయంలోని ఉద్యోగులు గత 15 నెలల నుంచి వేతనాలు అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాస్, ఇన్చార్జి చైర్మన్ కురుసింగా ఓం ప్రకాష్, సీఈవోలు వెంకటేశ్వర్ గౌడ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా ఎస్పీగా మలికా గార్గ్




**పల్నాడు : మే 18,**
పల్నాడు జిల్లా ఎస్పీగా మలికా గార్గ్ నియమితులయ్యారు. ఆమె గతంలో కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా పని చేశారు. తర్వాత ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకు పైగా పని చేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పని చేశారు. మలికా గార్గ్ పశ్చిమ బెంగాల్కి చెందిన పోలీస్ అధికారిని. కాగా ఈమె పల్నాడు జిల్లాకు వచ్చిన తొలి మహిళా ఎస్పీగా ఉన్నారు.

## పల్నాడు జిల్లా కలెక్టర్ గా శ్రీకేశ్ లాట్కర్



**పల్నాడు** జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాట్కర్ నియమితులయ్యారు. ఈయన 2011 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన వ్యక్తి. గతంలో ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కోఆపరేషన్ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్ గా వ్యవహరించారు. అలాగే శ్రీకాకుళం జిల్లాలో కలెక్టర్ గా కూడా పని చేశారు. ప్రస్తుతం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పనిచేస్తుండగా.. బదిలీపై పల్నాడుకు కలెక్టర్ గా రానున్నారు.

# నిదులున్న నీళ్లు రావాయే

- వేసవి ఆఖరి నెలల్లో నీళ్లకై తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు.
- గ్రామానికి పది లక్షల ఫండ్స్ ఉన్నాయంటున్న మిషన్ భగీరథ అధికారులు.
- గత రంజాన్ మాసంలో పనులను మొదలు పెడతామన్న ఆర్ డబ్ల్యు ఎస్, డిఈఈ, ఏఈ.
- ఇప్పటివరకు మొదలు పెట్టడం లేదంటున్న గ్రామస్తులు.



**బెజ్జూర్ మే 18** కొమరం భీం (ఆసిఫాబాద్) జిల్లా బెజ్జూర్ మండలం కుకుడా గ్రామంలో మిషన్ భగీరథ విషయంలో నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం, ఇంటింటికి మిషన్ భగీరథ నీటిని అందిస్తానని తెలియజేశారు. కానీ కుకుడ గ్రామానికి ఒకే చోట నీళ్లు వస్తున్నాయి. కిలో మీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామే తప్ప, ఇంటింటికి పైప్లైన్ సరఫరా విషయంపై గ్రామస్తులు మాట్లాడుతూ, ఆర్, డబ్ల్యు, ఎస్, ఏఈ. ఆర్, డబ్ల్యు, ఎస్, డిఈఈలను అడిగితే ఆ డిపార్మెంట్ అధికారులు మీ గ్రామానికి మిషన్ భగీరథ పైప్ లైన్ కొరకై పది లక్షలకు పైగా ఫండ్స్ వచ్చి ఉన్నాయంటున్నారు. ఇట్టి విషయం రంజాన్ సెలవులు ఉన్నాయంటూ, అందుకే పనులు చేయలేక పోయామని, గత కొన్ని నెలల తర్వాత అడిగితే, ఎన్నికల కోడ్ కారణంగా పనులను మొదలు పెట్టలేక పోయామని, కోడ్ ముగిసిన వెను వెంటనే పనులు చేపడతామని, గత కొన్ని నెలల క్రితం నుండి తెలియజేస్తున్నారే తప్ప, గ్రామంలో మిషన్ భగీరథకు సంబంధించిన పైప్ లైన్ వేయడం గాని, పనులను మొదలు పెట్టడం లేదంటూ, ఆచితూచి మాటలతో మా గ్రామ ప్రజలను మభ్యపెడుతున్నారే తప్ప మా కష్టాలని నెరవేర్చ లేక పోతున్నారని అన్నారు. మా యొక్క గ్రామానికి నిధులు వచ్చి ఉంటే వాటి రికార్డ్స్ చూపియండి అని అడిగిన కానీ, మాకు చూపెట్టడం లేదంటూ, చాలాసార్లు సర్వేలు నిర్వహించి పనులు చేపడతామంటూ, ఆచి తూచిగా అధికారులు సమాధానాలు చెప్తున్నారే తప్ప, మా గ్రామానికి వచ్చిన ఫండ్స్ ని వేరోక గ్రామాలకు తరలించారా...? లేదా ఈ పనులు చేయవద్దంటూ ఆపేస్తున్నారా....? అంటూ, గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందికరమైన విషయంగా మారిందని, పై అధికారుల ఒత్తిడి వలననో లేదా రాజకీయ నాయకుల ఒత్తిడి వలననో తెలియదు గాని, మా గ్రామ ప్రజల ఉసురు పోసుకుంటున్నారంటూ, వారిది వారే కుమ్మక్కయి మా గ్రామానికి చెందిన ఇండ్లకు నీళ్లు అందిస్తలేరంటూ గ్రామస్తులు తెలియజేశారు. ఇప్పటికైనా త్వరితగమనంగా పనులు మొదలుపెట్టి, మిషన్ భగీరథకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుచున్నారు.

## భారత రాజ్యాంగాన్ని రక్షించడమే, మహనీయులకు సరైన నివాళి అంబేద్కర్ జన జాతర

### ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్



**హనుమకొండ : మే 18,**
హనుమకొండ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ.. అంబేద్కర్ సమ సమాజ నిర్మాణానికి స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి అంబేద్కర్ సిద్ధాంతాలు ఉపయోగపడ్డాయన్నారు.భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం, మతసామరస్యం కలిగి ఉందన్నారు.భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. భారత రాజ్యాంగంను రద్దు చేయడానికి అనేక కుట్రలు జరుగుతున్నాయని, 3000 ఏళ్ల కిందటి మనుస్మృతి ప్రాచీన భారత రాజ్యాంగంగా ప్రవేశపెట్టెందుకు నేటి పాలకులు ప్రయత్నిస్తున్న విధానాలను తిప్పికొట్టాలన్నారు.అంబేద్కర్ స్ఫూర్తితో కులరహిత సమాజం కోసం తన తుదిశ్వాస వరకు కృషి చేసిన మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగాన్ని ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక న్యాయాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని,రాష్ట్రంలో,జిల్లాలో ఉన్న సామాజిక ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు ఉద్యమించాల్సిన అవసరముందన్నారు.

## తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు..?

**తెలంగాణ : మే 18,** జూన్ మొదటి వారంలో వార్డుల విభజన.. రెండవ వారంలో రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభం..మూడవ వారంలో సర్పంచ్ లకు రిజర్వేషన్ ప్రక్రియ..
జులై మొదటి వారంలో షెడ్యూల్, చివరి వారంలో నోటిఫికేషన్..షెడ్యూల్ ప్రకారం ఆగష్టు 2 లోపు ఎన్నికలు నిర్వహణ..ఆగస్టు 10లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్..మధ్యాహ్నం1 గంట వరకు పోలింగ్.. 2గంటల తరువాత లెక్కింపు.. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నిక..తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 12,814 గ్రామపంచాయతీలు, 88,682 వార్డులకు ఎన్నికలు..కసరత్తు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం...రేపు కేబినెట్ సమావేశంలో ఆమోదించే అవకాశం..

## వాన పడింది.. వజ్రాల వేట మొదలైంది



**కర్నూలు : మే 18,**
కర్నూలు జిల్లా తుగ్గలిలో తొలకరి జల్లులు కురవడంతో ఇక్కడి ప్రజలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. జొన్నగిరికి వెళ్లి వజ్రాల అన్వేషణను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వజ్రాల వేట సాగుతోంది. ఒక్క వజ్రం దొరికితే తమ తలరాత మారిపోతుందన్న ఆశతో వజ్రాలు వెదుకుతున్నారు. గతేడాది కోట్ల విలువ చేసే వజ్రాలు దొరకడంతో ఈఏడాది వజ్రాల కోసం జనం తరలి వచ్చారు.

## ఈనెల 23 వరకు తెలుగు రాష్ట్రాల్లో అతిభారీ వర్షాలు



**తెలంగాణ : మే 18**
ఈ నెల 23 వరకు తెలుగు రాష్ట్రాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 22న నైరుతీ బంగాళాఖాతంపై అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా శ్రీలంక వరకు ఉపరితల ద్రోణి ఆవరించి ఉంది. దీంతో ఈ నెల 23 వరకూ ఏపీ, తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. కోస్తాంధ్ర, తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపటికి బంగాళాఖాతంలోని ఆగ్నేయ ప్రాంతాలపై నైరుతీ రుతుపవనాలు విస్తరించనున్నాయి.


## శనివారం నుంచి రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి రాయితీ



**ఆంధ్రప్రదేశ్ : మే 18,**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఖరీఫ్-2023 కరవు సాయం, మిచౌంగ్ తుఫాను పంట నష్ట పరిహారం (ఇన్పుట్ సబ్సిడీ) నేటి నుంచి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. 11.57 లక్షల మందికి రూ.1,289 కోట్లు అందించనుంది. ఖరీఫ్ రైతులకు రూ.847 కోట్లు, మిచౌంగ్ బాధితులకు రూ.442 కోట్లు సాయం చేయనుంది. ఈసీ ఆంక్షలు సడలించడంతో ఇప్పటికే ఆసరా, విద్యా దీవెన నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే.

## వాట్సాప్ స్టేటస్‌లో 1 మినిట్ వీడియో!




ఐఓఎస్ యూజర్ల కోసం వాట్సాప్ 'స్టేటస్ అప్‌డేట్స్-1 మినిట్' ఫీచర్ తీసుకొచ్చింది. ఇప్పటివరకు 1-30 సెకన్ల వీడియోలు మాత్రమే స్టేటస్ పెట్టుకునేందుకు వీలుండగా, ఇక నుంచి ఒక నిమిషం వరకు నిడివి గల వీడియోలను స్టేటస్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ కొంతమంది బీటా టెస్టర్లకు అందుబాటులో ఉందని, త్వరలోనే మిగతా వారికి అందుబాటులోకి వస్తుందని వాబీటా ఇన్ఫో వెల్లడించింది.

## గ్రూప్-4 అభ్యర్థులకు అలర్ట్.. టీఎస్‌పీఎస్సీ నుంచి గుడ్ న్యూస్..




**తెలంగాణ : మే 18,**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 అభ్యర్థులకు తీపికబురు చెప్పింది. త్వరలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఉంటుందని టీఎస్‌పీఎస్సీ ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది.అభ్యర్థులందరూ వెరిఫికేషన్‌కు కావల్సిన సర్టిఫికేట్లను సిద్ధం చేసుకోవాలని పేర్కొంది.ఇప్పటికే జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ త్వరలో అభ్యర్థులను డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తామని ప్రెస్ నోట్‌లో తెలిపింది. 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలుస్తామని పేర్కొంది. ఇక దివ్యాంగుల కోటాలో 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఆహ్వానిస్తామని స్పష్టం చేసింది.డాక్యుమెంట్ వెరిఫికేషన్లకు కావల్సిన సర్టిఫికేట్లను సిద్ధం చేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్(2021-22), కమ్యూనిటీ, నాన్ క్రీమీ లేయర్ సర్టిఫికేట్, పిడబ్ల్యూడి , స్టడీ కండక్ట్ సర్టిఫికేట్స్ మొదలైనవి రెడీగా ఉంచుకోవాలని పేర్కొంది.కాగా గతేడాది జులై 1న టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4 పరీక్ష నిర్వహించగా ఈ ఏడాది ఫిబ్రవరి 9న జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదల చేసింది. తాజాగా ఈ ప్రెస్ నోట్ విడుదల చేయడంతో అభ్యర్థులు కోటి ఆశలతో వేచి చేస్తున్నారు.మరోవైపు జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) నిర్వహించే పీజీఈసెట్ 2024 పరీక్షా తేదీలను వాయిదా వేసినట్టు పీజీఈసెట్ 2024 కన్వీనర్ డా. ఏ.అరుణ కుమార్ శుక్రవారం ప్రకటించారు. ఈ పరీక్షలను జూన్ 10 నుండి 13 వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇదివరకు జూన్ 6 నుంచి 9 వరకు పరీక్షలు నిర్వహించాలని భావించినా.. చాలా మంది అభ్యర్థులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, టీఎస్పీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు హాజరవుతున్నందున పరీక్ష తేదీలను మార్చినట్టు తెలిపారు.

## రేగోడు మండలం బ్రహ్మంగారి మఠం వద్ద ఘనంగా నిర్వహించిన కుస్తీ పోటీలు



**రేగోడు : మే 18,** మెదక్ జిల్లా రేగోడు మండలంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం తెలంగాణలో మొదటి స్థానం గా పేరుగాంచినది.ఈ బ్రహ్మేంద్ర స్వామి వారి మఠం వద్ద శనివారం మల్ల యుద్ధం అనగా కుస్తీ పోటీలు జరిగాయి.అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా భారీ ఎత్తున ప్రజలు తరలి రావడం, మల్ల యుద్ధ పోటీలను ఆస్వాదించడం జరిగింది. పోలీస్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ కుస్తీ పోటీలో నిర్వహించడం జరిగింది. ఇక్కడ గెస్ట్ గా సినీ యాక్టర్ జ్యోతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కృష్ణ, గొల్ల నర్సింలు, అంజిబాబు, పోలీస్ ఈరన్న, ఎడిగి శంకర్ గౌడ్ పిసి, మొదలగువారు పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ చేసిన పనికి ఫ్యాన్స్ ఫిదా






ఐపీఎల్ 2024 సీజన్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ అదరగొడుతోంది. గతంలో ఎన్నడూలేనంతగా భారీ స్కోర్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతోంది. బౌలింగ్ లోనూ రాణిస్తూ వరుసగా విజయాలు సాధిస్తోంది. గత మూడేళ్లుగా ప్లే ఆఫ్స్ కు చేరుకోలేక, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం కోసం పోటీ పడిన ఎస్ ఆర్ హెచ్ ఈ సీజన్ లో టైటిల్ ఫేవరేట్ గా నిలిచింది. లీగ్ దశలో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఆ జట్టు ప్లే ఆఫ్ కు చేరుకుంది. ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిస్తే సన్ రైజర్స్ పాయింట్ల పట్టికలో ఏకంగా టాప్ – 2 కు చేరుకుంటోంది. దీంతో ఎస్ ఆర్ హెచ్ అభిమానులు తెగ ఖుషీ అవుతున్నారు. ఇదే జోరు కొనసాగించి ఐపీఎల్ ఛాంపియన్ గా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు. కాగా ఎస్ఆర్‌హెచ్ ఈ రేంజ్‌లో దూకుడుగా ఆడడానికి కారణం కెప్టెన్ కమిన్స్ కూడా ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆసీస్ ను విశ్వవిజేతగా నిలిపిన కమిన్స్ ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్ ను కూడా ఐపీఎల్ ఛాంపియన్ గా నిలబెట్టడంలో తన వంతు కృషి చేస్తున్నాడు. దీంతో అభిమానులు, నెటిజన్లు కమిన్స్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అయితే తాజాగా మరో మంచి పని చేసి అభిమానుల హృదయాలు గెల్చుకున్నాడీ ఆసీస్ కెప్టెన్. వివరాల్లోకి ఎస్ఆర్‌హెచ్ తర్వాతి మ్యాచ్ పంజాబ్ కింగ్స్ తో ఆడనుంది. ఆదివారం (మే19) ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. కాగా ఈ మ్యాచ్ కు ముందు కాస్త విశ్రాంతి తీసుకున్నాడు కెప్టెన్ కమిన్స్. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాడు. అక్కడి పాఠశాల మైదానంలో విద్యార్థులతో సరదాగా క్రికెట్ ఆడాడు. కొంతమంది పిల్లలు కమిన్స్ కు బౌలింగ్ చేశారు. ఆ తర్వాత ఎస్ ఆర్ హెచ్ కెప్టెన్ ? వికెట్ కీపింగ్ చేస్తూ ఆకట్టుకున్నాడు. ఆసీస్ కెప్టెన్ తమతో కలిసిపోయి క్రికెట్ ఆడడంపై పిల్లలు బాగా ఎంజాయ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇది చూసిన అభిమానులు ఫిదా అవుతున్నారు. 'ఛాంపియన్ ప్లేయర్ తో క్రికెట్ ఆడడం ఆ పిల్లలకు ఎప్పటికీ గుర్తుండి పోతుంది.' 'నువ్వు గ్రేట్ కమిన్స్ మావా', ' విద్యార్థుల ముఖాల్లో నవ్వులు నింపినందుకు సంతోషంగా ఉందంటూ కమిన్స్‌కు ధన్యవాదాలు చెబుతున్నారు ఫ్యాన్స్.

# సానియాపై పాక్ నటుడి కామెంట్స్‌పై నెటిజన్ల ఫైర్



పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్, నటి సనా మాలిక్ ప్రస్తుతం హనీమూన్ మూడ్ లో ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో వీరి వివాహం జరగ్గా, ఇప్పుడు అమెరికాలో హనీమూన్ ఎంజాయ్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారీ కపుల్. మరోవైపు షోయబ్ మాలిక్ తో విడాకుల అనంతరం సానియా మీర్జా దుబాయ్ కి షిఫ్ట్ అయింది. ప్రస్తుతం తన కుమారుడి ఆలనా పాలనలో బిజిబిజీగా ఉంటోంది తప్పితే షోయబ్ మూడో పెళ్లి ముచ్చట గురించి ఎలాంటి కామెంట్లు చేయలేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. స్ఫూర్తిదాయకమైన సందేశాలను షేర్ చేస్తూ తనకు తాను ధైర్యం చెప్పుకుంటోంది. అయితే షోయబ్ తో విడాకుల తర్వాత సానియా కూడా రెండో పెళ్లి చేసుకుంటుందని ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై సానియా కానీ, ఆమె కుటుంబ సభ్యులు కానీ పట్టించు కోలేదు. అయితే ఇలాంటి పుకార్లు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఓ పాకిస్థానీ నటుడు షోయబ్ మూడో పెళ్లి చేసుకున్నట్లు, సానియా మీర్జా కూడా రెండో పెళ్లి చేసుకోవాలని సలహా ఇచ్చాడు. మళ్లీ పెళ్లి చేసుకోమని సానియా మీర్జాకు పాక్ ప్రముఖ నటుడు నబీల్ జాఫర్ సలహా ఇచ్చాడు. ఓ పాకిస్థానీ టీవీ షోలో అతను ఈ కామెంట్లు చేశాడు. దీనికి సంబంధించిన వీడియో, కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'ఎవరైనా మహిళ విడాకులు తీసుకుంటే కచ్చితంగా మళ్లీ పెళ్లి చేసుకోవాల్సిందే. మహిళ జీవితం ఒక వ్యక్తితో ముగియకూడదు. మీకంటూ ఓ జీవిత భాగస్వామి ఉండాలి. షోయబ్ మాలిక్ మూడో పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు సానియా మీర్జా కూడా రెండో పెళ్లి చేసుకోవాలి' అని జాఫర్ కామెంట్స్ చేశాడు. అయితే ఈ పాకిస్థానీ నటుడు ఇచ్చిన సలహా అభిమానులు, నెటిజన్లకు అస్సలు నచ్చలేదు. దీంతో జాఫర్ పై తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. ' సానియా మీర్జా వ్యక్తిగత జీవితం గురించి చాలా తక్కువ మాట్లాడండి. ఆమె ఏమి చేయాలి? ఏమి చేయకూడదు అనే దానిపై మిమ్మల్ని సలహా అడిగారా? పెళ్లి చేసుకోవాలా వద్దా అన్నది ఆమె నిర్ణయం' అంటూ పాక్ నటుడికి హిత బోధ చేశారు నెటిజన్లు.

# హార్దిక్ పాండ్యాపై నిషేధం

## ఐపీఎల్ 2025లో తొలి మ్యాచ్ నుంచి ఔట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17లో ముంబై ఇండియన్స్ తమ చివరి మ్యాచ్‌లో కూడా ఓడిపోవడం ద్వారా ప్రచారాన్ని ముగించింది. ఈ ఓటమి తర్వాత ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఒక మ్యాచ్ నిషేధానికి గురయ్యాడు. లక్నో సూపర్‌జెయింట్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో, ముంబై ఇండియన్స్ నిర్ణీత సమయంలో 20 ఓవర్లు పూర్తి చేయలేదు. తద్వారా హార్దిక్ పాండ్యా రూ.30 లక్షలు అందుకున్నాడు. జరిమానాతో ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే, ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టు మ్యాచ్‌లు ముగియడంతో వచ్చే సీజన్‌లో ఈ నిషేధం అమల్లోకి రానుంది. దీని ప్రకారం, హార్దిక్ పాండ్యా %ఖూా% 2025లో ముంబై ఇండియన్స్ తరపున ఆడితే, అతను మొదటి మ్యాచ్ నుంచి నిషేధం విధించారు. ఎందుకంటే ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఒక్కో జట్టు 20 ఓవర్లను 1 గంట 30 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఎక్కువ సమయం తీసుకుంటే, ఒక ఫీల్డర్ బౌండరీ లైన్ నుంచి తప్పుకోనున్నాడు. అలాగే, ఈ తప్పు చేసిన జట్టు కెప్టెన్‌కు 12 లక్షల రూపాయలు జరిమానా విధించారు. అదే తప్పు 2వ సారి పునరావృతమైతే రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, జరిమానా విధిస్తారు. అదనంగా, ప్లేయింగ్ ఎలెవన్‌లోని 10 మంది ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25% జరిమానా విధించబడుతుంది. మూడోసారి ఇదే తప్పు పునరావృతమైతే జట్టు కెప్టెన్‌కు 30 లక్షల రూపాయాల జరిమానాతోపాటు, దీంతోపాటు మూడు ఫౌల్‌లకు పాల్పడిన కెప్టెన్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధిస్తారు. అదేవిధంగా ప్లేయింగ్ ఎలెవన్‌లో 10 మంది ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.12 లక్షలు అందజేయనున్నారు. లేదా మ్యాచ్ ఫీజులో 50% జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. తదనుగుణంగా లక్నో సూపర్ జెయింట్స్, పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో రెండుసార్లు స్లో ఓవర్ రేట్ పొరపాటు చేసిన హార్దిక్ పాండ్యా.. ఇప్పుడు మూడోసారి కూడా అదే తప్పును పునరావృతం చేశాడు. దీంతో ఐపీఎల్ 2025 తొలి మ్యాచ్‌లో నిషేధానికి గురయ్యాడు.

# ఆ క్షణంలో నా గుండె బద్దలైంది: కోహ్లి




సూపర్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లి ఐపీఎల్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉండి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. 13 మ్యాచ్‌ల్లో 66 సగటు, 155 స్ట్రైక్‌రేటుతో 661 పరుగులు చేశాడు. ఇదే జోరులో ఇవాళ చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో చెలరేగి ఆర్సీబీని ప్లేఆఫ్స్‌కు చేర్చాలని కోహ్లి కసిగా ఉన్నాడు.అయితే తన కెరీర్‌లో రెండు సార్లు హార్ట్ బ్రేక్ అయ్యిందని కోహ్లి తెలిపాడు. ఒకే ఏడాదిలో ఆ రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయని వివరించాడు. 2016 టీ20 వరల్డ్ కప్‌లో భారత్ సెమీఫైనల్‌లో ఓటమిపాలవ్వడం, అదే ఏడాది ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌లో ఓడి కప్‌ను చేజార్చుకోవడం తనని ఎంతో బాధించిందని తెలిపాడు.ఐపీఎల్–2016లో కోహ్లి 16 మ్యాచ్‌ల్లో 973 పరుగులు చేశాడు. నాలుగు సెంచరీలు, ఏడు హాఫ్ సెంచరీలు బాదాడు. 81 సగటు, 152 స్ట్రైక్‌రేటుతో రన్స్ సాధించాడు. ఓ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడి కోహ్లి నెలకొల్పిన 973 పరుగుల రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇక ఆ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో అయిదు మ్యాచ్‌ల్లో విరాట్ 273 పరుగులు చేశాడు. భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. కానీ టైటిల్ అందుకోలేకపోయాడు. తాజాగా ఈ సంఘటనలను కోహ్లి గుర్తు చేసుకున్నాడు. "నా జీవితంలో, 2016లో నా గుండె రెండు సార్లు బద్దలైంది. ఒకటి టీ20 వరల్డ్ కప్ అయితే, రెండోది ఐపీఎల్ ఫైనల్. టీ20 ప్రపంచకప్‌లో ఓడిన బాధను అధిగమించడానికి నాకు ఎన్నో రోజుల సమయం పట్టింది. ఎందుకంటే అప్పుడు భారత్‌కు ట్రోఫీని అందించాలనే కసితో ఎంతో పోరాడాను" అని కోహ్లి అన్నాడు. కాగా, మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్‌లో గొప్పగా రాణించడానికి ప్రయత్నిస్తా అని కోహ్లి తెలిపాడు. తనలో ఉండే కసినే తనని ముందుకు నడిపిస్తుందని చెప్పాడు.

# పీఎఫ్ విత్ డ్రాయల్స్ కోసం ఈపీఎఫ్ఓ కొత్త రూల్.. అదేమిటంటే..?!








ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సబ్ స్క్రైబర్ల కోసం కీలక నిర్ణయం తీసుకున్నది. పీఎఫ్ విత్ డ్రాయల్స్ కోసం అనుసరించాల్సిన నిబంధనలు మార్చేసింది. తాజాగా మార్చిన నిబంధనల వల్ల పీఎఫ్ లబ్ధిదారులకు మరింత లబ్ధి చేకూరుతుంది. తాజాగా మార్చిన నిబంధనల వల్ల ఈపీఎఫ్ఓ సబ్‌స్క్రైబర్లకు కలిగే ప్రయోజనం ఏమిటో తెలుసుకుందాం..ఈపీఎఫ్ఓ సబ్ స్క్రైబర్లు మరణించినప్పుడు వారి ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా చేయడానికి ఆధార్ తప్పనిసరి. కొన్ని సందర్భాల్లో ఆధార్ లేకపోవడంతోపాటు తప్పులు దొర్లుతున్నాయి. దీనివల్ల ఈపీఎఫ్ ఖాతా నుంచి డబ్బు విత్ డ్రా చేయడం కష్టతరంగా మారింది. సకాలంలో డబ్బు అందక సంబంధిత వ్యక్తి కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకునే వారు.

దీంతో తమ సబ్‌స్క్రైబర్లు మరణిస్తే ఆధార్ కార్డు సమర్పించాల్సిన అవసరం లేకుండా సంబంధిత వ్యక్తి కుటుంబ సభ్యులు పీఎఫ్ విత్ డ్రా చేసుకునే సౌకర్యం ఈపీఎఫ్ఓ తీసుకొచ్చింది. మరణించిన ఉద్యోగి పని చేస్తున్న సంస్థలో హెచ్‌ఆర్ విభాగం.. తమ ఉద్యోగి మరణించారని నిర్ధారిస్తూ ఈపీఎఫ్ఓ వెబ్ సైట్లో వెల్లడించాలి. ఈ వివరాలు సరైనవేనని నిర్ధారించిన తర్వాత ఈపీఎఫ్ఓ కార్యాలయం ఆఫీసర్ ఇన్‌చార్జీ (ఓఐసీ) అనుమతి ఇస్తే.. సదరు వ్యక్తి పీఎఫ్ విత్ డ్రా ప్రక్రియ మొదలవుతుంది. ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లో సంబంధిత సబ్ స్క్రైబర్ యూఏఎన్‌లో ఆయన వివరాలు సరిగ్గా ఉన్నా.. ఆధార్ డేటా బేస్‌లో సమాచారం అసంపూర్ణంగా ఉన్నప్పుడే ఈ నిబంధన వర్తిస్తుందని ఈ నెల 17న జారీ చేసిన ప్రకటనలో ఈపీఎఫ్ఓ తెలిపింది. మరణించిన ఈపీఎఫ్ఓ ఖాతాదారుడికి ఆధార్ లేకపోయినా.. ఆ సబ్ స్క్రైబర్ నామినీ ఆధార్.. సిస్టమ్‌లో సేవ్ అవుతుంది. నామినీ సంతకం చేయడంతోపాటు జాయింట్ డిక్లరేషన్ ఫామ్ సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ నామినీ పేరు చేర్చకుంటే, సంబంధిత సభ్యుడి కుటుంబ వారసుల్లో ఒకరు జాయింట్ డిక్లరేషన్ ఫామ్ మీద అటెస్ట్ చేయించి.. ఇతర కుటుంబ సమ్మతితో పీఎఫ్ మనీ విత్ డ్రా కోసం క్లయిమ్ దాఖలు చేయొచ్చునని గత మార్చి 26న ఈపీఎఫ్ఓ వెల్లడించింది.

# టెక్నాలజీని అర్థం చేసుకుంటేనే విజయం

## ఏఐపై పట్టుకు గూగుల్ సీఈఓ పిచాయ్ కుండబద్దలు..!



రోజురోజుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ వాడకం పెరుగుతుండటంతో ఉద్యోగావకాశాల పట్ల టెక్ నిపుణుల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ, టెక్నాలజీ నిపుణుల భవితవ్యంపై గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. టెక్నాలజీని లోతుగా అర్థం చేసుకుంటేనే టెక్ నిపుణులు పరివర్తన చెందగలరని, ఏదైనా సాధించగలరని తాను నమ్ముతానన్నారు. రోట్ లెర్నింగ్ (బట్టీ పట్టి చదవడం) కంటే ప్రతి అంశాన్ని లోతుగా అర్థం చేసుకున్నప్పుడే విజయం సాధించగలమని తాను నమ్ముతానని అన్నారు. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు ఏ అంశాన్నైనా తెలుసుకోవచ్చునని, దాన్ని అర్థం చేసుకునే పద్ధతిని పాటించాలని చెప్పారు.ఏ అంశమైనా తెలుసుకోవడానికి, దాన్ని అర్థం చేసుకోవడానికి మధ్య వ్యత్యాసం వివరించేందుకు 'త్రీ ఇడియట్స్'లోని ఓ సన్నివేశాన్ని సుందర్ పిచాయ్ గుర్తు చేశారు. ఒక తరగతి గదిలో టీచర్.. 'మోటార్' ఎలా పని చేస్తుందో నిర్వచనం ఇవ్వాలని విద్యార్థిని అడిగితే.. కంఠస్థం చేసిన నిర్వచనం ఇవ్వడానికి బదులు.. సాధారణ పదాలతో 'యంత్రం' అంటే ఏమిటో వివరిస్తాడని, విషయాన్ని గ్రహించడం అంటే ఇదేనన్నారు. భారతీయ వంటకాలపై తన ఇష్టాయిష్టాలనూ సుందర్ పిచాయ్ బయట పెట్టారు. ప్రాంతాల వారీగా బెంగళూరులో ఉన్నప్పుడు తాను దోశె బాగా తినే వాడినని, ఢిల్లీలో చోలే బటూరై, ముంబైలో 'పావ్ బాజ్' అంటే చాలా ఇష్టం అని చెప్పారు.

# భారత్‌లోకి 'టెస్లా' ఎంట్రీ అనుమానమేనా..




%నాఎఓఖుఎష్ట్ర ఖుత్–ఞవంశ్రీఖు% ఎ భారత్ మార్కెట్లోకి గ్లోబల్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ 'టెస్లా' ఎంట్రీపై నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అమితాబ్ కాంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతి విద్యుత్ కంపెనీ కోసం భారత్ వేర్వేరు విధానాలు అవలంభించబోదని స్పష్టం చేశారు. గత నెలలో భారత్‌లో టెస్లా సీఈఓ ఎలన్ మస్క్ పర్యటించాల్సి ఉన్నా, చివరిక్షణంలో ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో భారత్ మార్కెట్లోకి టెస్లా కార్ల రంగ ప్రవేశంపై అమితాబ్ కాంత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.'అన్ని కంపెనీల కోసం కేంద్రం ఈవీ పాలసీ రూపొందించింది. ఈ పాలసీని కంపెనీలు అనుసరించాల్సిందే. కొన్ని ప్రత్యేకమైన సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం తన విధానంలో మార్పులు చేయదు' అని అమితాబ్ కాంత్ చెప్పారు. తమ కంపెనీ కోసం టెస్లా కొన్ని ప్రత్యేక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముంగిట పెట్టనున్నదన్న వార్తల నేపథ్యంలో అమితాబ్ కాంత్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. భారత్‌లో కార్ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడానికి వీలుగా ఈవీ పాలసీలో ఇన్సెంటివ్‌లు ప్రకటించారు.భారత్‌లో కనీసం రూ.4150 కోట్ల (500 మిలియన్ డాలర్లు) పెట్టుబడి పెట్టే ఈవీ సంస్థలకు రాయితీలు అందిస్తామని కేంద్రం తెలిపింది. కేంద్రం పాలసీ ప్రకారం దేశంలో 'ఈవీ కార్ల తయారీ యూనిట్' ఏర్పాటు చేయాలి. లేదా దేశీయంగా తయారైన విడి భాగాల్లో 25 శాతం వినియోగించాలి. ఐదేండ్ల తర్వాత 50 శాతం విడి భాగాలు దేశీయంగా తయారైనవే వాడాలి.

# లీజుకు కియా కార్లు.. నెలకు రూ.21,900తో

## హైదరాబాద్‌తోపాటు మరికొన్ని నగరాల్లో అందుబాటులోకి



'కియా లీజ్' పేరుతో ఓ కొత్త కార్యక్రమానికి కియా శ్రీకారం చుట్టింది. ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో ఈ లీజింగ్‌ను కియా పరిచయం చేసింది. తొలి దశ కింద హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పుణె నగరాల్లో లీజుకు కియా కార్లు అందుబాటులో ఉండనున్నాయి. లీజు కాలం పూర్తయిన తర్వాత వాహనాన్ని తిరిగి ఇచ్చేయవచ్చు. అవసరాన్ని, ప్రాధాన్యతలనుబట్టి మరో కొత్త మాడల్ కారును మళ్లీ లీజుకు తీసుకోవచ్చు. 'లీజింగ్ మాడల్.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతున్నది. భారత్‌లోనూ దీనికి విశేష ఆదరణ లభిస్తున్నది. అందుకే 'కియా లీజ్'ను తీసుకొచ్చాం. దీనివల్ల మా కస్టమర్లు మున్ముందు ఇంకా పెరుగుతారు' అని ఈ సందర్భంగా కియా ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ మైయుంగ్–సిక్ సోన్ ఆశాభావం

# జక్కన్న మూవీ కోసం మళయాల నటుడు పృథ్వీరాజ్

### ఎక్స్‌లో వైరల్‌గా మారిన వార్త




మహేశ్‌బాబు హీరోగా దర్శకధీరుడు రాజమౌళి ఓ భారీ ప్రాజెక్ట్ రూపొందించనున్న విషయం తెలిసిందే. ఎంబి 29గా ఇది ప్రచారంలో ఉంది. దీనిపై వార్తలు సోషల్ మీడియాలో చక్కెర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఎక్స్‌లో షేర్ అవుతోంది. దీంతో ఈ హ్యాష్ ట్యాగ్ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రంలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్రలో కనిపించనున్నారట. ఈ విషయమై పృథ్వీరాజ్‌ను రాజమౌళి సంప్రదించారని.. ఆయన కూడా ఓకే చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన ఇందులో విలన్‌గా కనిపించనున్నారట. దీనిపై అధికారిక ప్రకటన కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఇదే నిజమైతే మహేశ్–పృథ్వీలను ఒకే స్క్రీన్‌పై చూడొచ్చని అభిమానులు ఆశపడుతున్నారు. మలయాళంలో స్టార్‌గా ఎదిగిన పృథ్వీరాజ్ ఇటీవల 'సలార్'తో ప్రేక్షకులకు ఆకట్టుకున్నారు. ఇప్పుడీ చిత్రంతోనూ ఇక్కడ అభిమానులను సొంతం చేసుకోవచ్చని భావించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆయన్ని తీసుకోవడం వల్ల మలయాళంలోనూ సినిమాను ప్రమోట్ చేసుకోవచ్చని చిత్రబృందం ఆలోచించినట్లు టాక్. తాజాగా ఈ సినిమా కాస్టింగ్ డైరెక్టర్ విషయంలో రూమర్స్ రాగా టీమ్ వాటిని ఖండించింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఏ అప్‌డేట్ అయినా నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తుందని క్లారిటీ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ గురించి రాజమౌళి ఇటీవల ఓ సందర్భంలో మాట్లాడుతూ.. నటీనటుల ఎంపిక పక్రియ జరుగుతున్నట్లు చెప్పారు. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటిస్తామన్నారు. ఈ సినిమాను 'మహారాజ్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో మహేశ్‌కు సంబంధించిన ఎనిమిది లుక్స్‌ను జక్కన్న టీమ్ రెడీ చేసినట్లు టాక్.

# హాలీవుడ్ మ్యాగజైన్‌లో దీపికా పడుకొణె

డెడ్‌లైన్స్ గ్లోబల్ డిస్‌రప్టర్స్ అనే హాలీవుడ్ మ్యాగజైన్ ప్రతీ ఏడాది.. ప్రపంచవ్యాప్తంగా వినోదరంగంలో రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటీనటుల జాబితాను విడుదల చేస్తుంది. ఇటీవలే విడుదల చేసిన ఈ ఏడాది జాబితాలో ప్రముఖ బాలీవుడ్ అగ్రతార దీపికా పదుకొణె చోటు దక్కించుకుంది. ఈ గౌరవాన్ని అందుకున్న ఏకైక భారతీయ నటిగా దీపిక నిలిచింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ..కొన్ని ఆసక్తికర విషయాల్ని తన అభిమానులతో పంచుకుంది. 'నటించిన సినిమా విజయం అందుకోవాలి, బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురవాలి, పాత్ర మెప్పించాలి, సినీ ప్రియులు కథనంతో పాటు సాగిపోయేలా కథలను ఎంపిక చేసుకోవాలి, అవార్డులు ప్రశంసలు దక్కాలి, మంచి స్థాయిలో ఉండాలి..ఇలా ఇవే ముఖ్యమంటారు కొందరు నటీనటులు. నా దృష్టిలో ముఖ్యమైనవి ఏమైనా ఉన్నాయంటే అది ఒక మంచి వ్యక్తిగా ఎదగడం, మంచి వ్యక్తులతో సమయం గడపడం, సెట్‌లోని అనుభవాలను మర్చిపోలేని జ్ఞాపకాలుగా గుర్తుచేసుకోవడం. ఇవే నాకు ముఖ్యం. ఇప్పుడీ గౌరవానికి కూడా కారణం అదే అని నా అభిప్రాయం'. ప్రపంచం చాలా చిన్నదై పోయిందని నేను అనుకుంటున్నా. సినీ రంగంలోని పరిశ్రమలన్నీ ఒక్కచోట చేరి ఈ ప్రపంచానికి గొప్ప కథలు చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. మనం చెప్పే కథల వల్లే ఈ ప్రపంచంలో మార్పులు వస్తున్నాయని నేననుకోవట్లేదు. ప్రేక్షకులు మెచ్చేలా, ఆశ్చర్యపోయేలా, ఆసక్తికరమైన కథలు మాత్రమే మనం చెబుతున్నాం. అదే జరుగుతుంది కూడా'. 'ఓం శాంతి ఓం' సినిమా కోసం నేను అసలు ఆడిషన్ ఇవ్వలేదు. 2007లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రంతోనే నేను బాలీవుడ్‌కి పరిచయమయ్యా. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఏ ఆడిషన్ చేయకుండానే నన్ను ఎంపిక చేశారు.అలా మొదలైన నా ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నా'. 'బాలీవుడ్‌లోనే కాదు హాలీవుడ్‌లోనూ నన్ను ప్రేక్షకుల ఆదరిస్తున్నారు. పదేళ్ల క్రితం నేను హాలీవుడ్ సినిమాలకు ఆడిషన్ ఇచ్చా.



అక్కడంతా కొత్త విధానం. అక్కడి సినిమాలోని నటనకు తగ్గట్టు నేను ఫాన్సీ యాక్టింగ్ స్కూల్లో చేరలేదు, ఇంగ్లిష్ నటనలో శిక్షణ తీసుకోలేదు. కానీ ఒక్కసారి హాలీవుడ్‌లో అడుగుపెట్టిన తర్వాత ఇంగ్లిష్ సినిమాలకి తగ్గ నైపుణ్యాలను నేర్చుకున్నట్లు చెప్పారు.

# రామోజీ ఫిల్మ్ సిటీలో మలేషియా సెట్టింగ్

### - శరవేగంగా పుష్ప-2 షూటింగ్

### - ఐటమ్ సాంగ్ కోసం జాన్వీని ఒప్పించే ప్రయత్నం



అనుకున్న తేదీ ఆగస్ట్ 15న ఎలాగైనా విడుదల చేయాలని 'పుష్ప 2' టీమ్ షూటింగ్ పూర్తి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. అందుకు తగ్గట్టే రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. అయితే ఐటమ్ సాంగ్ కోసం ఇంతవరకూ ఎవరినీ ఖరారు చేయలేదని తెలుస్తోంది. చివరకు జాన్వీ కపూర్‌ను ఒప్పించేలా డైరెక్టర్ సుకుమార్ ఉన్నట్లు టాక్. ఈ సినిమా కోసం మలేషియాలో కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కించాలనుకొన్నారు.

అయితే ఇప్పుడు అంత టైమ్ లేదు. అందుకే హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీనే మలేషియాగా మారుస్తున్నారు. అక్కడ ఈ సినిమా కోసం ఓ భారీ సెట్ తీర్చిదిద్దారు. అక్కడే మలేషియాలో తెరకెక్కించాల్సిన సీన్స్ షూట్ చేస్తున్నారు. 'పుష్ప 2' షూటింగ్ ఎంత వేగంగా జరుగుతున్నా టీమ్‌ని రెండు విషయాలు ఇబ్బంది పెడుతున్నాయని తెలుస్తోంది. ఒకటి.. ఫహద్ ఫాజిల్ ఈ సినిమాకు డేట్లు కేటాయించడం లేదు. ఈ సినిమాలో ఫహద్ కీలక ప్రాత పోషిస్తున్న సంగతి తెలిసిందే. తనపై ఇప్పటికే కొంతమేర షూటింగ్ చేశారు. అయితే మరో 15 రోజుల కాల్షీట్లు అవసరం అయ్యాయి. కానీ ఫహద్‌కు ఉన్న బిజీ కారణంగా డేట్లు కేటాయించడం లేదు. మరోవైపు ఐటెమ్ సాంగ్ చేసే హీరోయిన్ సమస్య కూడా వెంటాడుతోంది. ఐటెమ్ గాళ్‌గా ఎవరిని తీసుకోవాలన్న విషయంలో ఇంకా ఓ క్లారిటీకి రాలేదని తెలుస్తోంది. చాలామంది అగ్ర కథానాయికల పేర్లు పరిశీలించారు. కానీ ఏదీ ఇంకా ఫైనల్ కాలేదు. ఎవరూ దొరకని పక్షంలో ఈ పాటని జాన్వీకపూర్‌తో చేయాలని భావిస్తున్నారట. ఈ విషయంలో ఈ వారంలో ఓ స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఇటీవల ' 2' నుంచి టైటిల్ సాంగ్ విడుదలైంది. మరో పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


# హీరామండి మరువలేని అనుభవం

### మనీషా కోయిరాలతో నటించడం అదృష్టం: సోనాక్షి




ప్రస్తుతం 'హీరామండి'కు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనాక్షి సిన్హా తన సహనటి మనీషా కొయిరాలకు క్షమాపణలు చెప్పినట్లు వెల్లడించారు. 'నాకు మనీషా అంటే ఎంతో ఇష్టం. 'హీరామండి: ది డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ మొత్తం చూసిన తర్వాత ఆమెకు క్షమాపణలు చెప్పాను. కొన్ని సన్నివేశాల్లో భాగంగా ఆమెతో దురుసుగా ప్రవర్తించాను. సిరీస్ చూశాక నేను వాటిని ఎలా చేయగలిగాను అనిపించింది. అందుకే సారీ చెప్పాను. ఆమె గొప్ప నటి. తన సహనటులను ఎంతో ప్రోత్సహిస్తారు. షూటింగ్ మొత్తం సరదాగా గడిపాం. అంత గొప్ప నటితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. మళ్లీ ఆమెతో నటించే రోజు కోసం ఎదురుచూస్తున్నా' అన్నారు. ఇక సంజయ్ లీలా భన్సాలీ గురించి మాట్లాడుతూ.. 'ఆయన దర్శకత్వంలో నటిస్తే కష్టపడాల్సిన అవసరం లేదు. సీన్‌కు ముందే అన్ని విషయాలు చర్చిస్తారు. భన్సాలీ నన్ను మెచ్చుకోవడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇంత గొప్ప పాత్రను ఇచ్చినందుకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను' అని చెప్పారు. 'హీరామండి'లో సోనాక్షీ ద్విపాత్రాభినయం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఆమె నెగెటివ్ ఛాయలున్న పాత్రల్లో కనిపించారు. వేశ్యల జీవితాల ఆధారంగా ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ రూపొందించిన ఈ సిరీస్‌లో మనీషా కొయిరాలా, అదితిరావు హైదరి, రిచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్ ఇతర కీలకపాత్రలు పోషించారు. దీనిపై బాలీవుడ్‌స్టార్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# సూర్యకు జోడీగా బుట్టబొమ్మ



సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా జూన్ తొలి వారం నుంచి అండమాన్ దీవుల్లో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో పడింది చిత్ర బృందం. ఇందులో భాగంగా సూర్యకు జోడీగా పూజా హెగ్డేను ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయంపై ఆమెతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందనుంది. తొలి షెడ్యూల్ దాదాపు 40రోజులకు పైగా సాగనున్నట్లు తెలుస్తోంది. దీంట్లో మలయాళ నటుడు జోజు జార్జ్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. సంతోష్ నారాయణన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# సంగ్రామ్ భలేరావ్‌గా రణ్‌వీర్ సింగ్



సంగ్రామ్ భలేరావ్‌గా 'సింగమ్ అగైన్'తో అలరించేందుకు సిద్ధమవుతున్నాడు బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. రోహిత్ శెట్టి దర్శకత్వంలో రానున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రణ్‌వీర్ తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. ఈ షూటింగ్ పూర్తయ్యాక అదిత్య ధర్‌తో ఓ సినిమాని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. దానికి 'ధురంధర్' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్టు తెలిసింది. 'ఈ కలయికలో రానున్న తొలి చిత్రం కాబట్టి చిత్రబృందం ఈ సినిమాని ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కించనుంది. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ని రాజకీయాలు, గ్యాంగ్‌వార్ నేపథ్యంలో రూపొందించనున్నారు. జూన్‌లో దీని చిత్రీకరణను మొదలుపెట్టనున్నారు' అని సన్నిహితవర్గాలు తెలిపాయి.

# పవిత్రతో చందు వివాహేతర సంబంధం

### - ఆమె మోజులో పడి ఆత్మహత్య - భార్య శిల్ప ఆవేదన



బుల్లితెర నటుడు చందు ఆత్మహత్యపై ఆయన భార్య శిల్ప స్పందించారు. ఐదు సంవత్సరాలుగా పవిత్రతో చందు సహజీవనం చేస్తున్నట్లు ఆమె మీడియా ముందు చెప్పారు. 'త్రినయిని' సీరియల్ వచ్చినప్పటి నుంచి వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగిందన్నారు. చందు తన వెంటపడి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని.. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు ఉన్నారని ఆమె వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా పవిత్ర మాయలో పడి తమను పట్టించుకోవడం మానేశాడని, ఇంటికి కూడా రావడం లేదని బాధను వ్యక్తం చేశారు. ఇంకా ఆమె మాట్లాడుతూ 'వివాహం జరిగిన తర్వాత వివాహేతర సంబంధం మూలంగా జీవితాలు నాశనం అవుతున్నాయి. ప్రస్తుతం మా పరిస్థితి కూడా అలాగే ఉంది. పవిత్ర ఆకస్మిక మృతితో చందు ఒత్తిడికి గురయ్యాడు. ఇటీవల కత్తితో కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. పవిత్ర నీ దగ్గరికి వస్తున్నా అంటూ ఇన్‌స్టాలో మెసేజ్ కూడా పెట్టారు. శుక్రవారం ఆయన ఫోన్ ఎత్తకపోయేసరికి అనుమానంతో తెలిసిన వాళ్లను అక్కడికి పంపాము. అప్పటికే ఆయన ఫ్యానుకి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డట్లు' శిల్ప చెప్పారు. తనకు, తన పిల్లలకు న్యాయం చేయాలని శిల్ప వేడుకున్నారు.

# ఆభరణాలు అందాన్ని రెట్టింపు చేస్తాయి : రాశిఖన్నా



మగువల అందాన్ని ఆభరణాలు రెట్టింపు చేస్తాయని సినీ నటి రాశి ఖన్నా అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని లుంబిని జ్యువెల్ మాల్‌లో మంగత్రయి నీరజ్ ఆధ్వర్యంలో ' వీనస్ ది గాడెస్ ఆఫ్ ఎమరాల్డ్' పేరుతో ప్రత్యేక కలెక్షన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాశిఖన్నా.. పలు ఆభరణాలను ధరించి సందడి చేశారు. అనంతరం రాశి ఖన్నా మీడియాతో మాట్లాడుతూ.. మన సంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ ఇక్కడ రూపొందించిన ఆభరణాలు తనకు ఎంతగానో నచ్చాయని తెలిపారు. ప్రతి అమ్మాయి ఆభరణాలను ధరించడానికి ఇష్టపడుతుందని, అలాగే తనకు కూడా ఆభరణాలు ధరించడం ఇష్టమేనని అన్నారు. అయితే సందర్భానుసారంగా తన అలంకరణ ఉంటుందని చెప్పారు. డిజైనర్ నయన్ గుప్తా రూపొందించిన ఈ ఆభరణాలు ప్రత్యేక రీతిని కలిగి ఉన్నాయని అన్నారు. మగువల, యువత మనసును ఇవి కచ్చితంగా దోచుకుంటాయని అభిప్రాయపడ్డారు. డిజైనర్ నయన్ గుప్తా మాట్లాడుతూ.. మగువల ఆలోచనలను ప్రతిబింబించేలా ఈ ఆభరణాలను రూపొందించినట్లు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా పలువురు మోడల్స్ నగలను ధరించి హొయలు పోయారు.

**Owner, Editor, Printed & Published :** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com